


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట...




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 169 | గురువారం 25- 06 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


# జొన్నగిరిలో బంగారంగని ప్రాజెక్టుకు శ్రీకారం

- పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో సరికొత్త అధ్యాయం
- ప్రైవేట్ రంగంలో బంగారం గనుల తవ్వకం ప్రారంభం
- తొలి ఏడాదిలో 400 కిలోల బంగారం ఉత్పత్తి లక్ష్యం
- సుమారు 700మందికి ఉద్యోగావకాశాలు
- రాయలసీమ అభివృద్ధికి కీలకమని ప్రకటించిన చంద్రబాబు






కర్నూలు,జూన్24 బ్యూరో నందిపత్రిక

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో బంగారంగని ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ప్రారంభించారు. అనంతరం రెండో యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్ తదితరులు పాల్గొన్నారు. జొన్నగిరి ప్రాజెక్టుకు జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దక్కన్ గోల్డ్‌మైన్స్ లిమిటెడ్ సంస్థలు ఇప్పటి వరకు రూ.405 కోట్లు వెచ్చించాయి. ప్రయోగాత్మకంగా చేసిన ఉత్పత్తి పక్రియ విజయవంతం కావడంతో వాణిజ్యపరంగా బంగారం ఉత్పత్తి చేసే పక్రియను సీఎం ప్రారంభించారు. ప్రైవేటు రంగంలో బంగారం గనుల తవ్వకం, ఉత్పత్తి చేసే పక్రియ ప్రారంభం కావడం దేశంలోనే ఇది మొట్టమొదటిసారి.

# చంద్రబాబు జేబు సంస్థగా పోలీస్ వ్యవస్థ



- సాయికృష్ణ కేసులో సాక్ష్యాలను మాయం చేశారు
- పోలీసుల తీరుకు నిరసనగా వచ్చేనెల 29న పాదయాత్ర
- మీడియా సమావేశంలో అంబటి రాంబాబు

# గ్రేడ్ 2 కార్యదర్శులుగా ఉన్న 132 మందికి పదోన్నతి

**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 24:** గ్రేడ్ 2 కార్యదర్శులుగా పనిచేస్తున్న 132 మందికి గ్రేడ్ వన్ కార్యదర్శులుగా పదోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ ఉత్తర్వులు జారీ చేశారు. ఫోర్త్ జోన్ విభాగంలో ఉన్న కర్నూలు, కడప అనంతపురం,చిత్తూరు, జిల్లాలో పనిచేస్తున్న కార్యదర్శులకు పదోన్నతి లభించింది. విజయవాడలోని తాడేపల్లి లో బుధవారం రాత్రి కౌన్సిలింగ్ నిర్వహించి పదోన్నతి పొందిన కార్యదర్శులకు ఆయా జిల్లాలకు కేటాయించారు. బండి ఆత్మకూరు మండలంలో గ్రేడ్ 2 కార్యదర్శులుగా పనిచేస్తున్న ఇరువురు కార్యదర్శులు గ్రేడ్ వన్ కార్యదర్శులుగా పదోన్నతి పొందారు. బండి ఆత్మకూరు సచివాలయంలో పనిచేస్తున్న కార్యదర్శి అక్బర్ ను రోస్టర్ విధానంలో కడప జిల్లాకు కేటాయించారు. పార్నపల్లి సచివాలయంలో పనిచేస్తున్న కార్యదర్శి ఇర్ఫాన్ ను నంద్యాల జిల్లాకు కేటాయించారు.





# అవనిగడ్డలో లోకేశ్ పర్యటన

- ఘనంగా స్వాగతించిన స్థానిక నేతలు
- మోపిదేవిలో ప్రత్యేక పూజలు
- కొక్కిలిగడ్డ జడ్పీ పాఠశాల నేతన భవనానికి ప్రారంభం



# అయోధ్య రామయ్య.. ఏమిటీ అపచారం!




అందరి బంధువయ్యా...అయోధ్య రామయ్యా అంటూ పాడుకునే హిందువులకు అయోధ్య అన్నా, రాముడన్నా విడదీయరాని బంధం ఉంది. ఎవరికి వారు అయోధ్య రాముడు తమవాడని భావిస్తారు. అందుకే అయోధ్య ఆలయ నిర్మాణం కోసం ఏళ్లుగా ఎదురు చూశారు. కోట్ల రూపాయలు ఆలయం కోసం విరాళంగా ఇచ్చారు. ఇంతటి పవిత్ర కార్యక్రమం జరిగి, ఆలయ నిర్మాణం పూర్తయిన తరవాత ఇప్పుడు నిధుల దారిమళ్లింపు గోల అందరినీ కలచి వేస్తోంది. నిజంగానే ఇది ఘోరమైన అపచారంగానే భావించాలి. రాముడిని నమ్మి భక్తులు భక్తితో సమర్పించిన కానుకులను కాజేస్తే ఎలా? రాముడి తిరిగొచ్చాడంటూ.. దేశవ్యాప్తంగా జరిగిన సంబరాలను అప్పడే మరచిపోలేదు.అయోధ్య రామాలయానికి భక్తులు సమర్పించిన విరాళాలు, కానుకల నిర్వహణలో భారీ అక్రమాలు జరిగినట్లు వెల్లడయ్యింది. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం విరాళాల సొమ్ము చోరీకి గురైనట్లు బలమైన ఆధారాలను కనుగొంది.

# తెలంగాణలో జనసేన జోరు...

- తెలంగాణపై ఫుల్ ఫోకస్ పెట్టిన పవన్ కల్యాణ్
- తెలంగాణ జాయినింగ్స్ కమిటీ ఏర్పాటు
- క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం



# రాజకీయాల్లో మహిళా వివక్ష



- ఆడవాళ్లు రాజకీయాల్లోకి వస్తే టార్గెట్
- ఇప్పటికీ ప్రపంచంలో లింగ వివక్ష

# కొత్త ఉద్యోగులతో సీఎం విజయ్..

- ట్యాంజెడ్‌కో కొత్త ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేసిన ముఖ్యమంత్రి



# అయోధ్య రామయ్యా..ఏమిటీ అపచారం !

దీనికి సంబంధించిన ప్రాథమిక నివేదికను త్వరలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు సిట్ సమర్పించనుంది. కొన్ని రోజులుగా అయోధ్యలో సిట్ బృందం ముమ్మరంగా విచారణ జరిపింది. ఆలయ హుండీల నుంచి సేకరించిన నగదును లెక్కించే సమయంలో సీసీటీవీ ఫుటేజ్‌పై చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. కొన్ని కీలకమైన సీసీటీవీ దృశ్యాలను కావాలనే డిలీట్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భక్తులు సమర్పించిన బంగారం, వెండి, వజ్రాభరణాల ను నకిలీ వాటితో మార్చేసారనే ఆరోపణలపై సిట్ లోతుగా విచారించింది. నిర్లక్ష్యంతో పాటు దీని వెనుక పెద్ద కుట్ర కోణం దాగి ఉందనే దిశగా అధికారులు దర్యాప్తు సాగిస్తున్నారు.అయోధ్య రామాలయానికి రోజూ పెరుగు తున్న భక్తుల తాకిడి చూసి.. పులకిస్తున్న మనసులు ఇంకా పూర్తిగా తేరుకోలేదు. ఇంతలోనే మహాపచారం జరిగిపోయిందన్న వార్త కలవరపెడుతోంది. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో సమర్పిస్తున్న విరాళాలు, కానుకలు మాయమయ్యా యన్న ఆరోపణలు అయోధ్యలో కలకలం రేపాయి. మొదట్లో ఇవి ఉట్టి ఆరోపణలే అని భావించిన వారు కూడా..తర్వాత సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించడంతో అంతా దిగ్భ్రమకు గురయ్యారు. చివరకు సిట్ ప్రాథమిక విచారణలోఅడుగుడగునా నిర్లక్ష్యం నిజమేనని బయటపడటం.. సీసీ టీవీ ఫుటేజ్‌లో మార్పులు.. అన్నీ కలిసి రామభక్తుల మనోభావాల్ని తీవ్రంగా దెబ్బతీశాయినే చెప్పాలి. ఎంతో భక్తితో, నమ్మకంతో, విశ్వాసంతో రాముడి ఆలయానికి ఉపయోగపడతాయనే ఉద్దేశంతో ఇచ్చిన విరాళాలు కొందరు స్వార్థపరుల చేతిలోకి వెళ్లిపోయాయని, ఆలయ వ్యవహారాలు చూసే ట్రస్టే.. కంచే చేను మేసిన చందంగా వ్యవహరి స్తోందని తెలిసి.. భక్తులు నిర్ఘాంతపోతున్నారు. దీనిపై పెద్దగా ప్రచారం రాకుండా చూస్తున్న తీరు ఇంకా కలచివేస్తోంది. ఐదు వందల సంవత్సరాల తర్వాత రామాలయం కొలువుదీరిందని ఓవైపు భక్తులో సంతోషపడుతుంటే.. మరోవైపు ఆలయంలో జరిగిన నిధుల గోల్‌మాల్ వ్యవహారం హిందువుల మనోభావా లను దెబ్బతీసే వ్యవహారంగానే చూడాలి. మొదట్లో నిధులు దారిమళ్లాయనే ఆరోపణలు వచ్చినప్పుడు.. వాటిని రాజకీయ ప్రేరేపితంగా కొట్టిపారేసే ప్రయత్నం జరిగింది. కానీ భక్తుల నుంచి అభ్యంతరాలు రావడంతో.. యూపీ సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ విషయంలో సీరియస్‌గానే ఉన్నట్లుగా కనిపిస్తోంది. సిట్ దర్యాప్తులో అన్నీ తెలుస్తాయని, కొంచెం ఓపిక పట్టాలని ఆయన చేసిన విజ్ఞప్తిని బట్టి తెలుసుకోవచ్చు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే..వచ్చేయేడు యూపి ఎన్నికలకు ముందు జరిగిన ఈ వ్యవహారం యోగా ప్రభుత్వానికి మచ్చలాంటిదే. మరోవైపు రాముడి పేరు చెప్పి.. పెద్ద మొత్తంలో సొమ్ము స్వాహా చేశారని ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. వచ్చే ఏడాది యూపీ ఎన్నికల తరుణంలో..రామాలయంలో నిధుల గోల్‌మాల్ వ్యవహారం..సంచలనం సృష్టిస్తోంది. ఈ భారీ అక్రమాలకు సంబంధించి సిట్ ఇప్పటివరకు ట్రస్ట్ అధికారులు, మేనేజ్‌మెంట్ సిబ్బంది, బ్యాంక్ ఉద్యోగులతో సహా దాదాపు 150 మందిని ప్రశ్నించింది. ట్రస్ట్ కార్యనిర్వాహకుడు అనిల్ మిశ్రా, కన్‌స్ట్రక్షన్ ఎయిడ్ గోపాల్ రావు పాత్రలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ కూడా ప్రస్తుతం నిఘా నీడలో ఉన్నారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న ఎస్‌బీఐ, టీసీఎస్‌లకు చెందిన ఆరుగురు ఉద్యోగుల ను కూడా ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో తిన్ను యాదవ్ అనే వ్యక్తితో పాటు కొందరు బ్యాంక్ సిబ్బందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యే అవకాశం ఉంది. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో సమర్పించే నగదు, బంగారం, వెండి, ఇతర ఖరీదైన విరాళాలు అక్రమార్కుల భోజ్యం అయినట్టు దర్యాప్తు సంస్థ గుర్తించింది. ముఖ్యంగా ఇంత ప్రతిష్టాత్మకమైన పెద్ద ఆలయ నిర్వహణలో ముఖ్య విభాగాలు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు జవాబుదారీతనం లేకపోవడం, వారిపై పర్యవేక్షణ, నిఘా లోపించడం, సీసీటీవీ ఫుటేజీలు అదృశ్యం కావడం దర్యాప్తు సంస్థను ఆశ్చర్యపరిచింది.ట్రస్ట్‌కు చెందిన కీలక అధికారులు దర్యాప్తు పూర్తయ్యే వరకు అయోధ్య విడిచి వెళ్లకూడదని సిట్ ఆదేశించింది. ఆలయ నిర్వహణలో పారదర్శకత కోసం కాశీ విశ్వనాథ్ ఆలయం తరహాలోనే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించాలని, ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణను పెంచాలని సిట్ సూచించనుంది. అలాగే విరాళాల లెక్కింపునకు బ్యాంకులు కేవలం రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే నియమించాలని, క్రమం తప్పకుండా ఆడిటింగ్ నిర్వహించాలని నివేదికలో సిఫార్సు చేయనున్నట్లు చెబుతున్నారు. అయోధ్య విరాళాలపై ఏర్పడిన వివాదంపై యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ స్పందించారు. ప్రజలు 15 రోజులు ఆగాలని కోరారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులు ఎవరైనా, ఎంతటివారైనా వదిలిపెట్టబోమంటూ హామీనిచ్చారు. మొత్తంగా రాముడి పేరు చెప్పి నిర్వాహకులే టోపీ పెట్టడం ఇప్పుడు తీవ్ర చర్చగా మారింది.

# ప్రతిఘటన పథంలో 'ఇండియా'

ప్రతిఘటన. జూన్ 8న 'ఇండియా కూటమి' (ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయెన్స్) అంతర్గత సమావేశంలో రాహుల్‌గాంధీ వెలువరించిన స్ఫూర్తిదాయక ప్రసంగం సారాంశాన్ని సంగ్రహపరిచిన పదమది. 'కాంగ్రెస్ పార్టీ ఒక ప్రతిఘటన ఉద్యమం' అని రాహుల్ ఉద్ఘాటించారు. ఈ వ్యాఖ్యను ప్రస్తుత కాంగ్రెస్ కార్యకలాపాల వాస్తవికత గురించిన ప్రకటనగా కాకుండా గతించిన తరాల వారిని ఎంతగానో ఉత్తేజపరిచిన ఒక ఆదర్శాన్ని పునరుద్ధరించి ఔదలదాల్చే సంకల్పంగా భావించాలి. వర్తమాన భారత ప్రజాస్వామ్యాన్ని పీడిస్తున్న సమస్యల గురించి ఆయన చేసిన నిశిత విశ్లేషణ, వాటిని అధిగమించేందుకు సూచించిన పరిష్కార మార్గాలే రాహుల్ ప్రసంగ విశిష్టతలు. అవి మౌలికమైనవి, కనుక సార్థకమైనవి. జాతి రాజకీయ జీవితంలో నిర్ణయాత్మక మార్పులు చోటుచేసుకుంటున్న తరుణమిది: పోటీతత్వ నిరంకుశత్వం (కాంపిటీటివ్ అథారిటేరియనిజం) నుంచి ఏకపక్ష ఆధిపత్యం (ఎలెక్టోరల్ ఆటోక్రసీ) భారత గణతంత్ర రాజ్య రాజకీయాలు పరివర్తన చెందుతున్న కీలక సందర్భంలో నేడు మనం ఉన్నాం. రాహుల్ ప్రసంగం దేశ రాజకీయాలలో రావాల్సిన ఒక వ్యూహాత్మక మార్పును కూడా స్పష్టంగా, తార్కికంగా ప్రకటించింది: ఎన్నికల పోటీ రాజకీయాల నుంచి ప్రతిఘటనాత్మక రాజకీయాలకు ప్రతిపక్షాలు పరివర్తన చెందాలి. ఈ ప్రకటనలోని ప్రధాన భావాలను చర్చించాలి, మెరుగుపరచాలి, సులభగ్రాహ్యం చేయాలి, ప్రజలలో వ్యాపింపజేయాలి. ఇది నేటి రాజకీయ కర్తవ్యాలలో ముఖ్యమైనది.

**రామకృష్ణారావుకు కీలక పదవి!** భారత ప్రభుత్వ యంత్రాంగాలు అన్నిటినీ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్వాధీనం చేసుకున్నదని రాహుల్ తన ప్రసంగంలో నిశితంగా విశ్లేషించారు. మీడియా, సోషల్ మీడియా, న్యాయ వ్యవస్థ, బ్యూరోక్రసీ దర్యాప్తు, గూఢచర్య సంస్థలు సమస్తమూ ప్రస్తుత ప్రభుత్వాన్ని ఎప్పటికీ అధికారంలో ఉంచేందుకు దీక్షాదక్షతలు చూపుతున్నాయని ఆయన గర్హించారు. ఈ పరిస్థితి మరింతగా అధ్వానమవుతోందని ఆయన స్పష్టంగా చెప్పారు. 'ఇంతవరకు తమ రాజ్యాంగ విధులను ఎలాగోలా సక్రమంగా నిర్వర్తిస్తున్న ప్రభుత్వ సంస్థలు సైతం సమీప భవిష్యత్తులోనే అలా పనిచేయడాన్ని నిలిపివేస్తాయి. కారణమేమిటి? భారత రాజ్య వ్యవస్థపై బీజేపీ, ఆరెస్సెస్‌లు తమ పట్టును ఎటువంటి మినహాయింపు లేకుండా సంపూర్ణంగా బిగిస్తాయని రాహుల్ అన్నారు. భారత ప్రజాస్వామ్యంలోని తిరోగమన పోకడలు, ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థల పతన రీతులను ప్రతిబింబిస్తున్నాయని రాజనీతి శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ పతనం రాత్రికిరాత్రే సంభవించినది కాదని మనకు తెలుసు. ప్రజాస్వామ్యం అంటే 'సంస్థాగత అనిశ్చితి' అని పోలిష్‌అమెరికన్ రాజనీతి శాస్త్రవేత్త ఆడమ్ ప్రెవోర్స్కీ సుప్రసిద్ధంగా నిర్వచించారు. ప్రజాస్వామ్యం అంటే పార్టీలు ఎన్నికలలో ఓడిపోయే వ్యవస్థ అని, అధికారాన్ని కోల్పోయే అపాయాన్ని పాలకులు అంగీకరించే విధానమే ప్రజాస్వామ్యమని ఆయన విశదీకరించారు. అధికారాన్ని కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకే పాలకులు రాజ్యాంగ వ్యవస్థల స్వతంత్రతను తగ్గించి వాటిని తమకు అనుకూలంగా చేసుకుంటున్నారు. తత్ఫలితంగా ప్రజాస్వామ్యం తిరోగమిస్తోంది. ప్రజాస్వామ్య తిరోగమనంలో రెండు మధ్యంతర దశలు ఉన్నాయి. మొదటిది పోటీతత్వ నిరంకుశత్వం. ఈ నిరంకుశత్వ పాలనా విధానం బహుళ పార్టీల ఎన్నికలను నిర్వహిస్తుంది. అధికారంలో ఉన్న వారు పరిస్థితులను ఎలాగైనా సరే పూర్తిగా తమకు అనుకూలంగా మలుచుకుంటారు. అధికారానికి పార్టీల మధ్య పోటీ ఉంటుంది. అయితే అది ప్రాథమికంగా అసమమైనది, అన్యాయమైనది. ఈ దృష్ట్యా ఇది నిజమైన ప్రజాస్వామ్యం కాదు. ఇక రెండోది ఏకపక్ష ఆధిపత్యం. ఈ వ్యవస్థలో క్రమం తప్పకుండా బహుళ పార్టీ ఎన్నికలు జరుగుతుంటాయి. అయితే ఆ ఎన్నికలు నామమాత్రమైనవే. ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన పౌర స్వేచ్ఛలు ఉండవు. పోటీ చేసే రాజకీయ పక్షాలకు సమాన అవకాశాలు ఉండవు. పాలకులు తమ ప్రయోజనాలు కాపాడుకోవడానికి నిర్నిబంధంగా అధికార దుర్వినియోగానికి పాల్పడతారు. నియంతృత్వ పాలనకు చట్టబద్ధత కల్పించేందుకు మాత్రమే ఈ ఎన్నికలు ఉపయోగపడతాయి. భారత్ ప్రస్తుతం ఈ రెండు దశల మధ్య ఉన్నది. 2019 సార్వత్రక ఎన్నికల అనంతరం మన దేశం ఒక నిరంకుశత్వ పాలనా రాజ్యంగా పరిణమించింది. ఏకపక్ష ఆధిపత్యంలోకి భారత్ పతనాన్ని 2024 సార్వత్రక ఎన్నికలలో ప్రజా తీర్పు నిలువరించింది. దేశ పాలకులు ఆనాటి నుంచీ ఏ ఎన్నికలలోనూ పరాజయం పాలవ్వకుండా ఉండేందుకు చేయని ప్రయత్నమేదీ లేదు. అందులో భాగంగా మీడియా ద్వారా సమాచారాన్ని నియంత్రిస్తున్నారు; ప్రభుత్వ అధికారాలను ఉపయోగించుకుని ఆర్థిక వనరులను అపారంగా సమకూర్చుకుంటున్నారు; ప్రభుత్వ సంస్థలు, రాజ్యాంగ వ్యవస్థలను పూర్తిగా తమ అదుపులోకి తీసుకున్నారు. ఇలా సమస్త సమాజంపై అసాధారణ గుత్తాధిపత్యం ద్వారా సంభావ్య రాజకీయ నష్టాలను సాధ్యమైనంత వరకు తగ్గించుకుంటున్నారు లేదా నివారించుకుంటున్నారు. వీటి ద్వారా తమకు ఏర్పడిన అనుకూలతలను మరింతగా పెంపొందించుకునేందుకై ఎన్నికల వ్యవస్థకు పునఃరూపకల్పన చేస్తున్నారు: నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియల ద్వారా దేశ రాజకీయ భౌగోళిక స్వరూపాన్ని మార్చివేసేందుకు పూనుకున్నారు; పంచాయత్ నుంచి పార్లమెంటు దాకా సమస్త ప్రజాప్రాతినిధ్య సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడమనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అనే నినాదంతో ఆ లక్ష్య పరిపూర్తికి ప్రజల ఆమోదాన్ని సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు; మరీ ముఖ్యంగా ఓటర్ జాబితాల సమగ్ర ప్రత్యేక సవరణ ద్వారా ఎన్నికల వ్యవస్థను ఎటువంటి మినహాయింపులేకుండా తమకు అనుగుణంగా మార్చుకునేందుకు ప్రస్తుత పాలకులు చురుగ్గా కృషి చేస్తున్నారు.ఈ ప్రక్రియలన్నీ పూర్తయినప్పుడు మన ప్రజాస్వామ్యం పూర్తిగా ఏకపక్ష ఆధిపత్యంగా రూపొందుతుంది. ఎన్నికల ద్వారా సాధారణ ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఒక రాజకీయ పక్షం నుంచి మరో రాజకీయ పక్షానికి అధికారం బదిలీ అయ్యేందుకు చాలా చాలా తక్కువ అవకాశం మాత్రమే ఉంటుంది. నిక్కచ్చిగా చెప్పాలంటే అది పూర్తిగా ఉపేక్షణీయ అవకాశం. మన ప్రజాస్వామ్యం నేతి బీర చందమవుతుంది. ప్రతిపక్షాలు ఎట్టకేలకు

ఈ కఠోర, నైరాశ్యపూరిత సత్యాన్ని గ్రహించాయి. దాన్ని ఎదుర్కోవడానికి సమకట్టాయి. రాహుల్ గాంధీ ప్రసంగం భారత ప్రజాస్వామ్యానికి వాటిల్లిన ప్రమాదాల విశ్లేషణకే పరిమితమైనది కాదు. అదొక ఉత్తేజకరమైన ఉపన్యాసం. ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేయడమేకాకుండా ధర్మ రక్షణకై చేపట్టాల్సిన రాజకీయ కార్యాచరణకు విస్పష్టమైన సూచనలు అందులో ఉన్నాయి. తత్కారణంగానే అది స్ఫూర్తిదాయకమైనది. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నిలబడే సంకల్పాన్ని మనలో జనింపజేసింది. మరి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రతిపక్షాలు ఇప్పటిదాకా అనుసరిస్తున్న రాజకీయ పద్ధతులు సత్ఫలితాలనివ్వడంలో సఫలమవడం లేదు. ఎందుకని? రాజ్యాంగ వ్యవస్థలను నియంత్రిస్తున్న పాలకులు రాజ్యాంగం నిర్దేశించిన విధంగా ప్రతిపక్షాలకు సమాన అవకాశాలు కల్పించడం లేదు. సమాన అవకాశాలు ఉన్నప్పుడు మాత్రమే ప్రజాస్వామిక రాజకీయ సాధనాలు ప్రభావశీలంగా ఉంటాయి. అటువంటి అవకాశాలు ప్రతిపక్షాలకు ఇంకెంత మాత్రం లేవు. రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న ప్రామాణిక రాజకీయ పద్ధతులు పని చేయనప్పుడు ఏది కార్యసాధకమవుతుంది? ప్రతిఘటన, అవును ప్రతిఘటనే అని రాహుల్ స్పష్టం చేశారు. ఎన్నికల రాజకీయాలపైనే ఎక్కువగా ఆధారపడడం ఇంకెంత మాత్రం శ్రేయస్కరం కాదని ఆయన గట్టిగా చెప్పారు. 'ప్రతిపక్షాలు ఎన్నికలలో గెలిచేందుకు అవి స్వేచ్ఛగా, సక్రమంగా జరగడం లేదు. కనుక మనం ప్రతిఘటన మార్గాన్ని అనుసరించాలి' అని రాహుల్ దృఢస్వరంతో చెప్పారు. ప్రతిఘటన ఒక స్ఫూర్తి కావాలి, ఒక మనోవైఖరిగా భాసించాలి అని రాహుల్ వక్కాణించారు. ప్రతిఘటన కేవలం సంస్థాగతంగా మాత్రమే ఉండకూడదు. అలా ఉన్న పక్షంలో దాని ప్రభావశీలత పరిమితమవుతుందని ఆయన అన్నారు. వివేకవంతమైన అంతర్దృష్టి ఇది, సందేహం లేదు. ప్రతిఘటన స్ఫూర్తి విశాల ప్రజానీకంలో మనసా, వాచా, కర్మణా వెలుగొందాలని ప్రతిపక్ష నాయకుడు ఆశించడం సూచిస్తున్నదేమిటి? ప్రతిపక్ష రాజకీయాలలో ఒక మౌలిక మార్పునే కాదూ? అవును, విపక్ష రాజకీయ కార్యాచరణ పార్లమెంటు నుంచి ప్రజా నిరసనలకు, ఎన్నికలలో పోటీ చేయడం నుంచి క్షేత్ర స్థాయిలో జన సమీకరణకు, అధికారాన్ని గెలుచుకునే రాజకీయాల నుంచి రాజ్యాంగ నిర్మాతలు నిర్దేశించిన మార్గంలోకి మన ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యాన్ని మళ్లీ తీసుకువెళ్లే రాజకీయాలకు మారాలి, మారితీరాలి. ఇది జరూరుగా జరగాలి. మనదైన ఒక ప్రజాస్వామిక పోరాటపథాన్ని మనం ఎంచుకోవాలి. తద్వారా మాత్రమే మన గణతంత్ర రాజ్యాన్ని సంకుచిత శక్తుల నుంచి విముక్తి చేయగలుగుతాము. ఈ చారిత్రాత్మక బాధ్యత కేవలం ఒక్క 'ఇండియా' కూటమిది మాత్రమే కాదు. చైతన్యశీల శక్తులు అన్నిటినీ సమ్మేళనపరచడం ద్వారా మాత్రమే ఆ బాధ్యతను సమర్థంగా, సార్థకంగా నిర్వహించడం సాధ్యమవుతుంది. ప్రతిఘటనకు ఇలా ప్రాధాన్యమివ్వడం రాజ్యాంగ విహిత, పార్లమెంటరీ పోరాట పద్ధతులను త్యజించాలని పిలుపునివ్వడం ఎంత మాత్రం కాదు. రాజకీయాలను అర్థవంతంగా, ఆచరణయోగ్యంగా మళ్లీ ప్రజలకు చేరువ చేసేందుకు అదొక అభ్యర్థన అన్న వాస్తవాన్ని గ్రహించాలి. ప్రజలు, ప్రతిపక్షాలు నిరంతరం ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రశ్నిస్తుండాలి. ప్రశ్నించడాన్ని, నిరసనలు తెలపడాన్ని మానివేస్తే వీధులు నిశ్శబ్దంగా ఉంటాయని,

ప్రజల మౌనం పార్లమెంటు ఒక ధూర్త సంస్థగా మారిపోయేందుకు దారితీస్తుందని దశాబ్దాల క్రితం డాక్టర్ రామ్ మనోహర్ లోహియా హెచ్చరించారు. ప్రజాశ్రేయస్సు పట్ల చిత్తశుద్ధిలేని పార్లమెంటు ప్రజాస్వామిక పాలనకు ఎలా దోహదం చేస్తుంది?

## దీర్ఘాయుష్షు గుట్టువిప్పిన శాస్త్రవేత్తలు!

కొంతమంది చాలాకాలం పాటు ఆరోగ్యంగా జీవించడానికి గల రహస్యం వారి జన్యువుల్లోనే దాగి ఉందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. కొన్ని కుటుంబాల్లో వంశపారంపర్యంగా వస్తున్న ఒక అరుదైన జన్యు మార్పు వారిని దీర్ఘాయుష్షుమంతులుగా, ఆరోగ్యవంతులుగా ఉంచుతున్నట్లు నెదర్లాండ్స్ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ జన్యువు ఉన్నవారిలో గుండె జబ్బులు, మధుమేహం వంటి వ్యాధులు ఇతరులతో పోలిస్తే సగటున 13 ఏళ్లు ఆలస్యంగా వస్తున్నట్లు తేలింది.

లీడెన్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్ పరిశోధకుడు పాస్కల్ పుట్టర్ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధన చేసింది. దీర్ఘకాలం జీవించిన తల్లిదండ్రులున్న 212 కుటుంబాల జన్యువులను విశ్లేషించారు. వీరిలో "సీజీఏఎస్' అనే జన్యువులో ఒక ప్రత్యేకమైన మార్పును కనుగొన్నారు. సాధారణంగా ఈ జన్యువు, కణాల్లోకి వైరస్ వంటివి ప్రవేశించినప్పుడు లేదా కణాలు దెబ్బతిన్నప్పుడు వాపు (ఇన్ ఫ్లమేషన్) ప్రక్రియను ప్రేరేపిస్తుంది. అయితే, దీర్ఘాయుష్షు గల కుటుంబాల్లోని వ్యక్తుల్లో ఈ జన్యువు పూర్తిస్థాయిలో కాకుండా పాక్షికంగా పనిచేస్తోంది. దీనివల్ల అనవసరమైన, దీర్ఘకాలిక వాపు ప్రక్రియ తగ్గుముఖం పడుతోందని, అదే వారి ఆరోగ్య రహస్యమని పరిశోధకులు వివరించారు.

ఈ పాక్షిక పనితీరు వల్ల రోగనిరోధక వ్యవస్థ ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యాన్ని కోల్పోకుండానే, వయసు పెరిగే కొద్దీ వచ్చే దీర్ఘకాలిక వ్యాధుల ముప్పు తగ్గుతోందని శాస్త్రవేత్తలు తెలిపారు.

గోథెన్‌బర్గ్‌లో జరిగిన యూరోపియన్ సొసైటీ ఆఫ్ హ్యూమన్ జెనెటిక్స్ సదస్సులో ఈ ఫలితాలను వెల్లడించారు. అయితే, ఈ జన్యు మార్పు చాలా అరుదైనదని, కేవలం కొన్ని ప్రత్యేక కుటుంబాల్లోనే కనిపించిందని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. దీర్ఘాయుష్షుకు జన్యువులతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి, పర్యావరణం వంటి ఇతర అంశాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయని వారు గుర్తుచేశారు.



# జొన్నగిరిలో బంగారంగని ప్రాజెక్టుకు శ్రీకారం

ప్రపంచంలో బంగారం గనులు, ఉత్పత్తి కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో ఒకటిగా జొన్నగిరికి అంతర్జాతీయ గుర్తింపు లభించనుంది. ఏటా రెండు టన్నుల బంగారాన్ని ఉత్పత్తి చేసేలా జియోమైసూర్ సంస్థ ప్రణాళికలు రచించింది. ఇక్కడ 700 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఉత్పత్తి చేసిన బంగారం విలువపై నాలుగుశాతం రాయల్టీ లభించనుంది. తొలి ఏడాది 400 కేజీల బంగారాన్ని ఉత్పత్తి చేయనున్న నేపథ్యంలో సుమారు రూ.57 కోట్లు రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది. ఈ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు కర్నూల్ జిల్లాలో ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ ఏపీ ఆర్థికాభివృద్ధిని పరుగులు పెట్టించడంలో అత్యంత కీలక పాత్ర పోషించనుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మైనింగ్ ప్రాజెక్ట్ ద్వారా రాయలసీమ ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం కావడంతో పాటు, స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఏపీలో పారిశ్రామిక వృద్ధికి, మైనింగ్ రంగానికి ఈ ప్రాజెక్ట్ ఒక కొత్త దిక్సూచిగా మారి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడనుంది. జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి గేమ్ ఛేంజర్‌గా మారబోతోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పెట్టుబడులు, ఉత్పత్తి లక్ష్యాలు, ప్రత్యేకతల వివరాలు ఈవిధంగా ఉన్నాయి. ఏడాదికి 400 కేజీల బంగారు ఉత్పత్తితో మైనింగ్ ప్రారంభం కానుంది. తదుపరి కాలంలో దీనిని ఏడాదికి 900 కేజీలకు పెంచుతారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలోకి వచ్చాక ఏడాదికి ఏకంగా 2 టన్నుల బంగారం ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానికులకు కేవలం ఉపాధి కల్పించడమే కాకుండా, వారిని నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారు. మైనింగ్ జరిగే ప్రాంతంలో వాడే అత్యంత భారీ వాహనాలను సురక్షితంగా నడిపేందుకు వీలుగా 'సిమ్యులేటర్ యంత్రాల' సహాయంతో స్థానిక మహిళలకు, యువతకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణా కేంద్రాన్ని సీఎం చంద్రబాబు స్వయంగా సందర్శించి, అభినందించారు. అనంతరం సీఎం చంద్రబాబు జెండా ఊపి ఖనిజంతో కూడిన మట్టిని తరలించే భారీ వాహనాలను ప్రారంభించారు.

# అవనిగడ్డలో లోకేశ్ పర్యటన

అవనిగడ్డ నియోజకవర్గంలో మంత్రి నారా లోకేశ్ పర్యటించారు. కొక్కిలిగడ్డ నుంచి మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్న మంత్రి.. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకునే ముందు గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. 'బాగున్నారా' అంటూ కరచాలనం చేశారు. 'లోకేశ్ అన్నా' అంటూ ప్రేమతో మంత్రిని స్థానిక ప్రజానీకం పలకరించింది.అనంతరం, వేద ఆశీర్వచనాలతో లోకేశ్‌కు దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి.. స్వామివారి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ఫొటో, లడ్డూ ప్రసాదాన్ని అందించి లోకేశ్‌ను అధికారులు సత్కరించారు. లోకేశ్ వెంట ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బోడే ప్రసాద్, వెనిగండ్ల రాము, కాగిత దర్శించుకున్నారు. అనంతరం మోపిదేవిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో టీడీపీ కార్యకర్తలు, నేతల సమన్వయ సమావేశంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. పెదప్రోలులో మంత్రికి మచిలీపట్నం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి, అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మోపిదేవి మండలంలో ఆధునీకరించిన కొక్కిలిగడ్డ జడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణలో గ్రామస్తులకు మంత్రి అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, ఎమ్మెల్సీ అశోక్ బాబు పాల్గొన్నారు. లోకేశ్ పర్యటన సందర్భంగా పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. ప్రతిఒక్కరికీ అభివాదం చేస్తూ మంత్రి ముందుకు సాగారు

# చంద్రబాబు జేబు సంస్థగా పోలీస్ వ్యవస్థ

ఏపీలో పోలీసు వ్యవస్థ చంద్రబాబు జేబు సంస్థగా మారిందని మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన ఆరోపణలు చేశారు. సాయికృష్ణ కేసులో సాక్ష్యాలను మాయం చేశారు. ఏ తప్పు చేయకపోయినా తనను అరెస్ట్ చేశారంటూ మండిపడ్డారు. 18 రోజుల పాటు రాజమండ్రి జైల్లో ఉంచారు. వచ్చే నెల 29న వినతి పాదయాత్ర చేస్తా అని అంబటి ప్రకటించారు. అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ..'కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఒత్తిడితోనే నాపై కేసులు నమోదు చేశారు. నా ఇంటిపై దాడి చేయడమే కాకుండా నాపై అక్రమంగా రెండు కేసులు పెట్టారు. నన్ను జైలులో ఉంచారు. రెండు కేసుల్లో ఏడేళ్ళ లోపు శిక్ష పడే సెక్షన్లే పెట్టారు. ఈ కేసులో ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐకి హైకోర్టు.. కోర్టు ధిక్కరణ కింద నోటీసులు ఇచ్చింది. వంశీధర్ అనే సీఐ, మధు అనే ఎస్ఐ ఇల్లీగల్‌గా నన్ను లోపలేశారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లుకి హైకోర్టు నోటీస్ ఇచ్చింది. ఈ ముగ్గురు పోలీసులను కేంద్ర మంత్రి పెమ్మసాని పురిగొల్పి నన్ను అరెస్ట్ చేయించారు. డీజీపీ, ఐజీ, ఎస్పీ, డిఎస్పీలకు చెబుతున్నాను. నా ఇంటిపై దాడి చేసిన వాళ్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదు. అందుకే వచ్చే నెల 29వ తేదీన వినతి పాదయాత్ర చేస్తున్నాను. పోలీస్ వ్యవస్థ చంద్రబాబు జేబు సంస్థగా కొనసాగుతుంది. సాయికృష్ణ అంశంపై మేము పోరాడటానికి కారణం వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయనే. కృష్ణలంక పోలీస్ స్టేషన్లో ఏడాది సీసీటీవీ ఫుటేజ్ మాయం చేశారు. ఏడాది నుండి పీఎస్‌లో నేరాలు జరుగుతున్నాయి. ఐజీ రవి ప్రకాష్ ఆధ్వర్యంలోనే సాక్ష్యాధారాలు మాయం చేశారు. సీఐ నాగరాజుతో బేరసారలాడారు. ఏ పోలీస్ పేరు చెప్పవద్దని సీఐ నాగరాజును బతిమలాడారు. ఏ తప్పు చేయకపోయినా నన్ను అరెస్టు చేసి జైలులో వేశారు. కానీ, సీఐ నాగరాజును లాకప్‌లో ఎందుకు వేయలేదు?. పోలీసులు ప్రజలను కాపాడలేరు. సీఎం, హోంమంత్రి విఫలమయ్యారు. పవన్ కల్యాణ్.. నాగరాజును జిందాబాద్ అంటారేంటి ఆయనకు సిగ్గు అనిపించడం లేదా?. పవన్ కల్యాణ్ ఆత్మవిమర్శ చేసుకోవాలి. హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణలో జనసేన జోరు...

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ ఇప్పుడు పొరుగు రాష్ట్రమైన తెలంగాణపై తన ఫోకస్ పెంచింది. తెలంగాణలో పార్టీ ఉనికిని చాటడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కేడర్‌ను బలోపేతం చేసేందుకు జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాచరణ మొదలుపెట్టారు. రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి, ఇతర పార్టీల నుండి వచ్చే వలసలను సమన్వయం చేయడానికి ఏడుగురు సభ్యులతో కూడిన 'తెలంగాణ జాయినింగ్స్ కమిటీ'ని అధికారికంగా నియమించారు. పార్టీ భావజాలానికి ఆకర్షితులవుతున్న విద్యావంతులు, సామాజికవేత్తలు, రిటైర్డ్ ఐఏఎస్/ఐపీఎస్ అధికారులు, తటస్థులను లైన్‌లోకి తెచ్చే బాధ్యతను ఈ ఏడుగురు సభ్యులకు అప్పగించారు.

# రాజకీయాల్లో మహిళా వివక్ష

రాజకీయాల్లో ఏది మాట్లాడినా తన మీద సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్ చేస్తున్నారని టీఆర్ఎస్ చీఫ్ కవిత అన్నారు. ఆడవాళ్లు రాజకీయాల్లోకి వస్తే ఇలానే టార్గెట్ చేస్తారనే భావనతోనే కొందరు కావాలనే ఈ ట్రోలింగ్స్‌కు పాల్పడుతున్నారని చెప్పారు. ఇప్పటికీ ప్రపంచంలో లింగ వివక్ష కొనసాగుతోంది. అనేక రంగాల్లో మగవారికే ప్రాధాన్యత లభిస్తోంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో కులాల కంటే.. మగవారి కులం, ఆడవారి కులం అనే రెండు మాత్రమే ఉన్నాయనిపిస్తోందని కవిత వ్యాఖ్యానించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో జరిగిన వేట విమెన్ ఎంపవర్‌మెంట్ సమ్మిట్‌లో మాట్లాడిన కవిత.. సమాజంలో, రాజకీయాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షపై ఆమె ఎమోషనల్ అయ్యారు. తెలంగాణ వచ్చాక పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తెచ్చుకున్నా.. ఇప్పటికీ అది పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. జీన్-జెడ్ జనరేషన్‌లోనూ అమ్మాయిలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, మహిళలు ఎదగాలని చూస్తే వెంటనే తొక్కేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఐటీ, బ్యాంకింగ్, మీడియా రంగాల్లో ఎంత సత్తా చాటుతున్నా.. పెళ్లి, కుటుంబ బాధ్యతల వల్ల మళ్లీ కెరీర్‌ను మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తోందని, అందుకే మహిళలకు ప్రభుత్వాలు, కుటుంబం, సమాజం సపోర్ట్ ఇవ్వాలని కోరారు. బాల్య వివాహాలపై కవిత షాకింగ్ గణాంకాలను బయటపెట్టారు. 2026 లో కూడా తెలంగాణ గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయని.. పె÷-లకైన 15-19 ఏళ్ల మధ్యలోనే అమ్మలవుతున్న టీనేజర్ మదర్స్ గ్రామీణ ప్రాంతాల్లో 7.2 శాతం ఉంటే, హైదరాబాద్ లాంటి మహానగరంలోనే 2.7 శాతం మంది ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థినులకు పిలుపునిస్తూ.. సోషల్ మీడియాలో లైకులు, ఫాలోవర్స్ రాలేదని నిరుత్సాహపడొద్దని, మహిళలంతా ఒక మంచి టా÷-గ్గ÷ట్ పెట్టుకొని, దాన్ని సాధించే దిశగా బలమైన గొంతుకతో ముందుకు సాగాలని కవిత పిలుపునిచ్చారు.

# మధ్యాహ్నం భోజనం నాణ్యత పెంచాలి..



## ఆర్. ఎ స్. యు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొండం నాటి ప్రశాంత్ డిమాండ్....

**నంది ప్రతినిధి, జూన్ 24, వైయస్సార్ కడప జిల్లా.** కడప నగరంలోని ఐటీ సర్కిల్ సమీపంలో ఉన్న గంగాభవాని బాలికల ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన పథకం మండల విద్యాశాఖ అధికారి (ఏ. ఈ. ఓ) తో కలిసి రెవిల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆ ర్. ఎ స్. యు) నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత లో పాలు ఉన్నాయని విద్యార్థులు తెలిపారు. ముఖ్యంగా ఉడికి ఉడకని అన్నం, నా సరికం నాణ్యత కలిగిన గుడ్లు అందిస్తున్నారని భోజనం సరిగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు.

గతంలో భోజనం చిన్న చిన్న నల్ల పురుగులు కనిపించాయని, ఆ కారణంగా పలువురు విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తీసుకుని వచ్చి తినాల్సిన పరిస్థితి ఏర్పడింది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ ఎస్ యు ప్రధాన కార్యదర్శి తొండం నాటి ప్రశాంత మాట్లాడుతూ, రాష్ట్ర విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని, క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడటం ఆందోళనకర మ ని అన్నారు. భోజనం తయారీ, నిల్వ, పంపిణీ ప్రక్రియల ను అధికారులు క్రమము తప్పకుండా నాణ్యత ప్రమాణాలు, పర్యవేక్షించి నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పాఠశాల ఎదురు నా పేరుకుపోయిన చెత్త, అశుభ్రత కారణంగా విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి పరిసరాలను శు భ్రపరచడంతో పాటు పాఠశాల వద్ద పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని. డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం నాణ్యమైన ఆహారం పరిశు భ్రమైన పాఠశాల వాతావరణ అత్యంత అవసరమని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏమ్ ఆర ఓ కి వినతి పత్రం ఇచ్చినట్లు ప్రశాంత్ తెలిపారు. ఆర్ఎస్ కు రాష్ట్ర కమిటీ సభ్యులు గురు మోహన్ యాదవ్, కడప నగర నాయకుడు చరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# నిర్లక్ష్యానికి గురికాబడిన సిఎస్ఐ ఎయిడెడ్ స్కూల్ ను పరిరక్షించాలి.





## యాజమాన్యం నిర్లక్ష్యంపై జోక్యం చేసుకోవాలి.

## డిఈఓ కు సిపిఐ , ఏఐఎస్ఎఫ్ వినతి.

కడప నగరం నడిబొడ్డున గల పురాతన సిఎస్ఐ ఎయిడెడ్ స్కూల్ నిర్వహణ పై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకొని పాఠశాలను పరిరక్షించాలని సిపిఐ నగర కార్యదర్శి యన్. వెంకట శివ డిమాండ్ చేశారు.బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో కు సిపిఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకట శివ మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుల కోసం 150 ఏళ్ల క్రితం క్రైస్తవ లండన్ మిషనరీలు ఏర్పాటుచేసిన సిఎస్ఐ హై స్కూల్ నిర్వహణ పట్ల సిఎస్ఐ చర్చి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఒకటిన్నర శతాబ్దకాలంగా పేద మధ్యతరగతి వర్గాలకు విద్యను అందిస్తున్న ఈ విద్యాసంస్థ అభివృద్ధి కంటే నిర్లక్ష్యమే ఎక్కువగా కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంలో, విద్యా వాలంటీర్లను ఏర్పాటు చేయడంలో, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకంలో యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా విద్యార్థుల అడ్మిషన్ సంఖ్య క్రమేపి తగ్గుముఖం పట్టేందుకు కారకులయ్యారన్నారు. స్కూల్ ప్రాంగణంలో కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్మాణాలు చేపడుతూ క్రమేపి స్కూలు స్థలమంతా లీజులకు ఇచ్చేందుకు, స్కూల్ ను నిర్వీర్యం చేసేందుకు సిఎస్ఐ చర్చి యాజమాన్యం బిషప్ తదితరులు కుయుక్తులు పడటం దారుణమన్నారు. నాలుగేళ్లుగా సిఎస్ఐ ఎయిడెడ్ స్కూల్ ను నిర్వీర్యం చేస్తుంటే, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తుంటే విద్యాశాఖ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించి సక్రమంగా విద్యను అందించకపోతే ప్రభుత్వము లేదా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి స్కూల్ ను విలీనం చేసుకొని పాఠశాల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సుదీర్ఘ చారిత్రాత్మక చరిత్ర కల్గి ఎంతోమందిని ఉన్నతులుగా తీర్చిదిద్దిన సిఎస్ఐ హైస్కూల్ పరిరక్షణకు జిల్లా విద్యాశాఖాధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, కార్యవర్గ సభ్యులు పగడపూల మల్లికార్జున, వడ్ల భాగ్యలక్ష్మి, ఆవుల నారాయణ, నాగార్జున ఏఐఎస్ఎఫ్ నాయకులు సుధాకర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అడిషనల్ డీఎంహెచ్ఓ శారదాబాయి

**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 24:** నంద్యాల జిల్లా అడిషనల్ డిఎంహెచ్ ఓ శారదాబాయి బుధవారం బండి ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వివిధ రికార్డులను చేశారు. మండలంలో ఎంతమంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారు, వారికి ఏ విధమైన చికిత్సలు జరుగుతున్నాయి అన్న విషయంపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. బండి ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బండి ఆత్మకూరు 1,2, నంద్యాల మండలం కొత్తపల్లిలో 1,2 సచివాలయాల్లో, బండి ఆత్మకూరు,ఏ కోడూరు,బి కోడూరు, పార్నపల్లి, కాకనూరు గ్రామాలలో 21 మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారని గుర్తించడం జరిగిందని, వారికి వివిధ స్థాయిలో వైద్య సేవలను అందిస్తున్నామని వైద్యాధికారి భావన రెడ్డి అడిషనల్ డిఎంహెచ్ శారద బాయి కి వివరించారు. ఈనెల 28న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని శారదాబాయి వైద్యాధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సవిత, భావన రెడ్డిలు పాల్గొన్నారు.



# విద్యా సామాగ్రి పంపిణి అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో

## కడప జిల్లా జమ్మలమడుగు పట్టణానికి చెందిన మాడెం గురు శంకర్ రెడ్డి (అగ్నిమాపక శాఖ ఉద్యోగి) గారి ఆర్థిక సహాయంతో



**కడప నంది పత్రిక ప్రతినిధి** ఖాజీపేట మండలం కొత్త పుల్లూరు యానాది కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు చదువుతున్న సుమారు 50 మంది విద్యార్థులకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి మరియు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చేతుల మీదుగా పలకలు, బలపాలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, ఎరేజర్, షాప్నర్స్ వంటి విద్యా సామాగ్రి పంపిణీ చేయడం జరిగింది మండల విద్యాశాఖ అధికారి-2 సత్య నాగ రాజు మాట్లాడుతూ దాతల రూపంలో ఉచితంగా పంపిణీ చేసిన విద్యాసామాగ్రిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారుఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నంద్యాల రవి చంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి తమ జీవిత కాలంలో సామాజిక బాధ్యతగా భావించి కనీసం 5 మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునివ్వడం జరిగింది.అనంతరం పాఠశాల ఆవరణంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటడం జరిగింది ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి వాగ్దాడం శివశంకర్ పాఠశాల ప్రధానో పాధ్యాయులు ప్రతాప్, నాగరాజు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లింగ నాయక్, పాల్గొన్నారు



## వై.ఎస్. జగన్ రెడ్డిని కలిసిన రెడ్యం సోదరులు

### తెలుగుదేశం పార్టీ తనకుటుంటాన్ని పెడుతున్న ఇబ్బందులను జగన్ దృష్టికి తెచ్చిన రెడ్యం సోదరులు



**కడప నంది పత్రిక ప్రతినిధి** పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని మంగళవారం సాయంత్రం వైయస్సార్సిపీ రాష్ట్ర కార్యదర్శిరెడ్యం వెంకటసుబ్బారెడ్డి , వైఎస్ఆర్సిపి నాయకులు , కె.సి.కెనాల్ ప్రాజెక్టు మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్ రెడ్డిలు కలిశారు. తెలుగు దేశంపార్టీ నేతలు తనకుటుంబాన్ని పెడుతున్న ఇబ్బందులతో పాటు, పలు రాజకీయ విషయలపై జగన్ తో రెడ్యం సోదరులు చర్చించారు. రెడ్యం కుటుంబాన్ని పెడుతున్న ఇబ్బందుల పై జగన్ కు పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి వివరించారు.వైఎస్ఆర్సిపి అడ్వకేట్ నాగిరెడ్డి తో కూడా చర్చించారు. మంగళవారం కాబట్టి గండి ఆంజనేయస్వామి ప్రసాధాన్ని రెడ్యం సోదరులు జగన్ , అవినాష్ లకు అందించారు,

## పత్తూరు పీర్ల చావిడి లో కొలువైన పీర్లు



**కడప నంది పత్రిక ప్రతినిధి** వైస్సార్ కడప జిల్లా ఖాజీపేట మండలం పత్తురు గ్రామంలో పీర్ల పండగ ప్రారంభంఅయింది. మంగళవారం వారం చిన్న సరిగిత్తు, బుధవారం విరామం గురువారం పెద్ద సరిగిత్తు నిర్వహించడం జరుగుతుంది అని శుక్రవారంఉదయం అగ్ని గుండం ప్రవేశం ఉంటుంది అని,సాయంత్రం పీర్ల పండగ అయిపోయింది అని నిర్వాహకులు తెలియజేసారు.

## విద్యుత్ స్ట్రగుల్ కమిటీ నిరసన కార్యక్రమం...

### పిఆర్ సి కమిటీ వెంటనే వేయాలి. కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేయాలి



**ఖాజీపేట నంది పత్రిక ప్రతినిధి జూన్ 24** చాపాడు సెక్షన్ ఆఫీస్ దగ్గర స్ట్రగుల్ కమిటీ నాయకులు రవీంద్రనాథ్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు నిరసన కార్య క్రమం చేపట్టారు. విద్యుత్ ఉద్యోగుల ఏప్రిల్ 2026 వేతన సవరణ కమిటీ ఏర్పాటు చేయాలని, పెండింగ్ లో 3కరువు భత్యం బకాయిలు చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులను రెగులర్ చేయాలనీ, సంస్థలో విలీనం చేయాలని, తెలంగాణ తరహాలో కాంట్రాక్టు కార్మికుల కు కనీస వేతనం 48వేలు చెల్లించాలని, నినాదాలు చేశారు. ఓ అండ్ ఎం కార్మికులకు ప్రత్యేకముగా 50% అలవెన్స్ మరియు పెట్రోల్ అలవెన్స్ ఇవ్వాలని ఉగాది డిమాండ్ చేశారు. మార్నింగ్ సబ్ స్టేషన్లు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని వారు కోరారు. విద్యుత్ శాఖలో క్రింది స్థాయి పోస్టులకు నూతన రిక్రూట్మెంట్ జరపాలని వారు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు కోటి రూపాయలు సౌకర్యం కల్పించాలని వారు తెలియజేశారు. పై సమస్యలు పరిష్కారం అయ్యే వరకు, స్ట్రగుల్ కమిటీ పిలుపు మేరకు, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని వారు పేర్కొన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి, ఉద్యోగులలో, కార్మికులతో వున్న అశాంతిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర , చంద్ర, విజయ్, బ్రహ్మయ్య, చంద్రకాంత్, బాలయ్య, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

## బేతంచెర్ల టౌన్ ఎఈ గా ఎ.వీర ప్రసాద్ బాధ్యతలు స్వీకారణ



**బేతంచెర్ల జూన్ 24 ( నంది పత్రిక ).** బేతంచర్ల టౌన్ ఎఈగా ఎ.వీర ప్రసాద్ బుధవారం నాడు పదవీ బాధ్యతలు స్వీకరించడం జరిగింది.ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలకు ఎటువంటి సమస్య నా దృష్టికి తీసుకువచ్చిన వెంటనే సమస్య పరిష్కారం చేస్తానని, పారిశ్రామిక వేత్తలకు, అలాగే బేతంచెర్ల పట్టణ ప్రజలకు నిరంతరం సేవ చేస్తానని ఏ సమస్య అయినా సరే నా దృష్టికి తీసుకొస్తే ఖచ్చితంగా పరిష్కారం చేస్తానని,ఏదైనా సమస్యలు ఉన్నచో ఆ సమస్యలు కూడా పరిష్కరిస్తానని పట్టణ ప్రజలకు పారిశ్రామికవేత్తలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బంది టౌన్ ఏఈ వీర ప్రసాద్ ను పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శివన్నఏఈ , లైన్మెన్లు ప్రసాద్ గౌడ్, నాగ రాజశేఖర్, స్టాప్ సుంకన్న, మల్లేష్, సుబ్బయ్య, రామన్న ఈద్రుస్ భాష,, శిరీష, ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ జగన్ చేతుల మీదుగా గట్టు లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునః ప్రతిష్ట

**కడప నంది పత్రిక ప్రతినిధి** పులివెందుల నియోజకవర్గం భూమయ్యగారిపల్లెలో వైఎస్ జగన్ చేతుల మీదుగా గట్టు లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునః ప్రతిష్ట.. ఆలయ కలశ స్థాపన, ప్రారంభోత్సవం..ఆలయ జీర్ణోద్ధరణకు రూ. కోటిన్నర నిధులందించిన గత వైఎస్ జగన్ సర్కార్..మొత్తం రూ. 2.5 కోట్లతో దేవాలయ పునర్నిర్మాణం..జగన్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా పలు ఆలయాల జీర్ణోద్ధరణ.. వైఎస్ జగన్ కు పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అర్చకులు..

# విద్యను వ్యాపారంగా మార్చిన గురువులపై చర్యలు తీసుకోండి







## పోరుమామిళ్లలో ప్రభుత్వ టీచర్ల కోచింగ్ మాఫియాపై విచారణ జరపాలి: ఎ ఐ ఎస్ ఎ డిమాండ్

**పోరుమామిళ్ల, జూన్ 24:(నంది పత్రిక ):** కడప జిల్లా పోరుమామిళ్ల ప్రాంతంలో కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు వివిధ పేర్లతో కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తూ ప్రభుత్వ ఉద్యోగ నియమాలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్నారని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు( ఏ ఐ ఎస్ ఏ )జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్ చేశారు.ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి (డి ఇ ఒ )కి వినతిపత్రం సమర్పించి అనిల్ ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో బోధన చేయాల్సిన ఉపాధ్యాయులు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి తల్లిదండ్రుల బలహీనతలను ఆసరాగా చేసుకుని వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వ జీతాలు తీసుకుంటూనే ప్రైవేట్ కోచింగ్ వ్యాపారాలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని, అయినప్పటికీ కొందరు ఉపాధ్యాయులు చట్టాలను లెక్కచేయకుండా కోచింగ్ సెంటర్లను నడుపుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఇది కేవలం నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదని, పేద విద్యార్థుల భవిష్యత్తుపై జరుగుతున్న దాడి అని ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రభుత్వ పాఠశాలల్లో పాఠాలు చెప్పాల్సిన గురువులు, కోచింగ్ సెంటర్లలో ఫీజుల కోసం విద్యార్థులను వెతుక్కోవడం సిగ్గుచేటు" అని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా సంబంధిత కోచింగ్ సెంటర్లపై తక్షణ విచారణ చేపట్టాలని, నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుల వివరాలను బహిర్గతం చేయాలని, నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే సస్పెన్షన్‌తో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను కోచింగ్ సెంటర్లకు మళ్లించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు."గురువు బోధనకు ప్రతీక కావాలి... వ్యాపారానికి కాదు. విద్య ఆలయం కావాలి... కోచింగ్ మార్కెట్ కాదు" అంటూ ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిరక్షణకు అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని అనిల్ విజ్ఞప్తి చేశారు. అలాగే మీడియా కు మేము ప్రభుత్వ ఉద్యోగులు అని చెప్పమని.. వారి పేర్లు చెప్పలేదని... అన్నారు.. గుమ్మడికాయల దొంగ ఎవరు అనే సామెత ప్రకారం ఒక ఉద్యోగి.. జర్నలిస్ట్ కి వాట్స్ ఖుజూజూ ద్వారా.. అనిల్ పైన కేసు పెడతాను అని బెదిరించడం.. లోనే తెలిసింది మీరు చేస్తున్న... మోసాలు అని అన్నారు. కేసులు జైళ్లు మాకేం కొత్త కాదు అని వరన్నారు

# అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి ముఖ్యమంత్రి వినతి పత్రం సమర్పించిన ఎమ్మెల్యే



**నంది పత్రిక ఆత్మకూరు...** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో నిన్న రాత్రి సచివాలయంలోని క్యాంప్ కార్యాలయంలో నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన పలు గ్రామంలో సిసి రోడ్లు మంచినీటి కుళాయి లైన్లో గ్రామము నుండి ఇంకొక గ్రామానికి తారు రోడ్లు సిద్దాపురం (బుడ్డా వెంగళ్రెడ్డి ప్రాజెక్టు) చెరువు కింద రైతులకు అందుబాటులో ఉండే విధంగా సైడ్ కాలువలు తీయడానికి అదేవిధంగా నియోజకవర్గం లోని పలు అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రితో చర్చించి, వినతిపత్రాలను అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు నాయుడు శ్రీశైలం నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు.

# ఇంటింటా సర్వేను పరిశీలించిన వ్యవసాయ అధికారి



**బండి ఆత్మకూరు నంది పుత్రిక జూన్ 24:** బండి ఆత్మకూర్ మండల పరిధిలో ఉన్న పార్లపల్లి, బండి ఆత్మకూరు గ్రామాలలో చేపట్టిన సర్వే కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ పర్యవేక్షించారు. మండలంలోని ప్రతి గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది ప్రతిరోజూ 90 రైతు కుటుంబాలను కలిసి అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం నిర్దేశించిన ఐదు సూత్రాలు, నీటి భద్రత డిమాండ్ ఆధారిత పంటలు, వ్యవసాయ సాంకేతికత, ఆహార శుద్ధి తో పాటు ప్రభుత్వ మద్దతు గురించి రైతులకు వివరించడం జరుగుతుందని అన్నారు. ఏపీఎంఎస్ యాప్ నందు జియో ఫెన్సింగ్ ద్వారా పకడ్బందీగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. మండలంలోని 13 రైతు సేవా కేంద్రాలలో 7980 రైతు కుటుంబాలు ఉండగా ప్రతిరోజు ఒక్కొక్క గ్రామంలో 90 కుటుంబాల ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని పూర్తిచేయాలని ఇబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది భారతి పుష్పలత రైతులు పాల్గొన్నారు.

**వరి మినీ ఇట్లు పంపిణి.** బండి ఆత్మకూరు మండలం పరిధిలో ఉన్న అయ్యవారి కోడూరు గ్రామ రైతులకు వరి మినీ కిట్లను పంపిణీ చేశారు. మార్టేరు ఎంటియు 1462 రకం గల కొత్తరకం విత్తనాలను మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, స్వర్ణ గ్రామ కార్యదర్శి భార్గవి, వి ఏ ఏ శ్రీనివాసరెడ్డి తదితరులు పంపిణీ చేశారు.

# రెవిన్యూ హెచ్చరిక బోర్డులు తొలగించి భూములు ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలి.





## అధికారం ఆర్థిక బలం ఉంటే హెచ్చరిక బోర్డులు తొలగించి భూములు ఆక్రమించుకోవచ్చా? పూర్వ తాసిల్దార్ త్రిభువన్ రెడ్డి హయాంలో జరిగిన భూ అక్రమ ఆన్లైన్ల వ్యవహారంపై విచారణ జరిపించాలి సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ చంద్రశేఖర్ డిమాండ్.

**గోపవరం జూన్ 24:(నంది పత్రిక ):**గోపవరం మండల పరిధిలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని, రెవెన్యూ వారు నాటిన హెచ్చరిక బోర్డులను సైతం తొలగించి ఏ అధికారి వస్తే మాకేంటి, మా కబ్జాలను అడ్డుకోలేరు అంటూ యదేచ్ఛగా ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, గత తహసీల్దార్ త్రిభువన్ రెడ్డి హయాంలో జరిగిన అక్రమ భూ లావాదేవీలు, ఆన్లైన్ మరియు జారీ చేసిన జినైన్ సర్టిఫికెట్స్, ఎండార్స్ మెంట్లపై ఉన్నతాధికారులతో విచారణ జరిపించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు యస్. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం గోపవరం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిటి సత్యమూర్తి గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన యస్. చంద్రశేఖర్ మాట్లాడుతూ, గోపవరం మండలంలో సెంచరీ పరిశ్రమ ఏర్పాటు తర్వాత భూములకు రెక్కలు వచ్చాయని, సెంటు స్థలం కొనాలంటే లక్షలు పెట్టాల్సి వస్తున్నదని దీంతో కొంతమంది అధికారం, అంగ, ఆర్థిక బలం కలిగిన బడానేతల కళ్ళు ఈ భూములపై పడ్డాయని, అనుకున్నదే తడవుగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని చదును చేసి పండ్ల తోటలు వేసుకుని దర్జాగా అనుభవిస్తున్నారని వారు ఆరోపించారు. శ్రీనివాసపురం వద్ద నుండి కుంట వరకురోడ్డుకు ఇరువైపులా మరియు అటు సంగసముద్రం వరకు ఉన్నటువంటి సర్వేనెంబర్ 168,234,290,1848,1852 లోని వందల ఎకరాలు ప్రభుత్వ భూములు మరియు తెలుగంగ కాలువకు ఇరువైపులా ఉన్న బఫర్ ల్యాండ్లను సైతం దర్జాగా ఆక్రమించుకొని ఆన్లైన్ లో ఎక్కించుకొని అనుభవిస్తున్నారని వారు ఆరోపించారు. రెవిన్యూ అధికారులు స్పందించి ఆయా భూములలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ ఏ ప్రభుత్వం ఉంటే మాకేంటి ఏ అధికారి వస్తే మాకేంటి అంటూ హెచ్చరిక బోర్డులను తొలగించి చదును చేస్తున్నారంటే వీరి బరితెగింపు చర్యల వెనుక ఏ నాయకుని మద్దతు ఉందో అర్థం చేసుకోవాలని ఆయన ఘాటుగా విమర్శించారు. ఇందులో ప్రధానంగా ఓ యువ నేత ప్రధాన అనుచరుడి పాత్ర కీలకంగా ఉందని మండలంలో గుసగుసలు వినిపిస్తున్నాయని దీనిపై అధికార పార్టీ నేతలు స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఈ ఆక్రమణల పరంపర గతంలో తాసిల్దారుగా పనిచేసిన త్రిభువన్ రెడ్డి హయాంలో భారీగా జరిగాయని, మండలానికి తానే నియంతలా వ్యవహరించి కబ్జాలకు సహకరించాడని ఆరోపణలు బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో తక్షణమే ఉన్నత స్థాయి అధికారులు త్రిభువన్ రెడ్డి హయాంలో జరిగిన భూలావాదేవిలు, అక్రమ ఆన్లైన్లు మరియు జారీ చేసిన జినైన్ సర్టిఫికెట్లు, ఎండార్స్మెంట్ లపై విచారణ చేపట్టి నిజాలు నిగ్గు తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమి దక్కితే పేదలకే దక్కాలని, ప్రజా ఉద్యమంలో భాగంగా సర్వేనెంబర్ 1557లో వేసిన హెచ్చరిక బోర్డును పరిశీలనకు వెళ్లిన తక్షణమే మాపై ఫిర్యాదు చేసి 20.07.2025 వ తేదీన 329(3),324(4),3(5) బిఎన్ఎస్ సెక్షన్ కేసు పెట్టిన రెవిన్యూ అధికారులకు నేడు మీ హెచ్చరిక బోర్డులు తొలగించి చదును చేస్తూ యదేచ్ఛగా పండ్ల తోటలను వేసుకుంటూ దర్జాగా అనుభవిస్తుంటే చూస్తూ ఉండడంలో ఆంతరమేంటని ఆయన ప్రశ్నించారు. పేదల పక్షాన పోరాడే మాపై కేసులు పెట్టిన మీరు అధికారం అంగ ఆర్థిక బలం కలిగిన వారిపై ఎందుకు కేసులు పెట్టడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నేతల ఆగడాలు మితిమీరిపోతున్నాయని అధికారులు సైతం అన్ని తెలిసి కూడా ఏమి చేయలేని పరిస్థితి మండలంలో నెలకొన్నదని దీనిపై జిల్లా అధికారులు దృష్టి పెట్టి బోర్డులు తొలగించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంచాలని లేనిపక్షంలో అర్హులైన పేదలందరినీ కూడదీసి ఉద్యమం చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కే జకరయ్య, నియోజకవర్గ నాయకులు కే బాబు, విజయరావు, రామరాజు, గంట మహబూబ్ బాషా, జయరామరాజు, చంద్రపాల్, జైపాల్ పట్టణ నాయకులు రేనాటి శ్రీను, ఈశ్వర్, సలీం, నరసింహ, బాలకృష్ణ, రమణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

# నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ & యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీగా కవలకుంట్ల మధు బాబు నియామకం



**పోరుమామిళ్ల,జూన్ 24:( నంది పత్రిక)** సుదీర్ఘ కాలంగా ప్రజాసేవలో ఉంటూ,బలమైన రాజకీయ మరియు సామాజిక నేపథ్యం కలిగిన ప్రముఖ నాయకులు కవలకుంట్ల మధు బాబుకు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. ఆయన సమాజానికి అందిస్తున్న నిస్వార్థ సేవలను గుర్తిస్తూ 'నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ & యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా' (నేషనల్ హ్యూమన్ రైట్స్ ఏంటి కరప్షన్, ఏంటి క్రైమ్ బ్యూరో అఫ్ ఇండియా ) సంస్థకు జాతీయ స్థాయి జాయింట్ సెక్రటరీ (జాయింట్ సెక్రటరీ ఆఫ్ నేషనల్ ) గా నియమిస్తూ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎస్.జ్యోతిస్వర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.కవలకుంట్ల మధు బాబు కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా,నిరంతరం అనేక సేవా కార్యక్రమాలతో సమాజంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.ముఖ్యంగా వికలాంగులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ,వారితో స్వయంగా కలిసి కూర్చుని సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడం ఆయన మానవత్వానికి నిదర్శనం.అలాగే వృద్ధుల సంరక్షణే ధ్యేయంగా వారికి ఉచితంగా దుస్తులు పంపిణీ చేయడం,అనాథాశ్రమాల్లోని పిల్లలకు ఆహారంతో పాటు స్వీట్లు పంచుతూ వారి ముఖాల్లో ఆనందాన్ని నింపడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను ఆయన నిరంతరం నిర్వహిస్తున్నారు.ఇలాంటి సేవాతత్పరతను పరిగణనలోకి తీసుకునే ఈ కీలక పదవికి ఆయనను ఎంపిక చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తా ఈ నియామకంపై కవలకుంట్ల మధు బాబు హర్షం వ్యక్తం చేస్తూ,తనపై నమ్మకంతో జాతీయ స్థాయి బాధ్యతలను అప్పగించిన సంస్థ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.తనకున్న రాజకీయ,సామాజిక అనుభవంతో సమాజంలో అవినీతి నిర్మూలనకు,మానవ హక్కుల రక్షణకు గట్టిగా కృషి చేస్తానని చెప్పారు.భవిష్యత్తులో కూడా అనాథలు,వృద్ధులు,మరియు వెనుకబడిన వర్గాల హక్కుల రక్షణ కోసం,వారి శ్రేయస్సు కోసం సంస్థ పరంగా మరిన్ని సేవా కార్యక్రమాలు విరివిగా చేపడతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.మధు బాబు నియామకం పట్ల పలువురు రాజకీయ విశ్లేషకులు,సామాజిక కార్యకర్తలు మరియు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నారు.

# దాతల సహకారంతో బాలాయ పల్లె పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

**కాశినయన, జూన్ 24:(నంది పత్రిక ):** కాశినాయన మండలం లోని బాలాయ పల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రిని మండల విద్యాశాఖాధికారుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. పోరుమామిళ్ల పట్టణంలోని మహబూబ్ నగర్ కాలనీ కి చెందిన క్రీడా ఫోటో గ్రాఫర్ జిలానీ దుబాయిలో పని చేస్తున్నారు. గత కొంత కాలంగా బాలాయ పల్లె పాఠశాల లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు ఖాసీం వల్లి ఇటు పాఠశాల లోను, అటు పోరుమామిళ్ల గ్రంధాలయం లోను చేస్తున్న వివిధ విద్యా కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా గమనించిన జిలానీ బాలాయ పల్లె పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు తన వంతుగా ఎంతో కొంత సాయపడాలనీ, పేద విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించాలనుకుంటున్నానని దుబాయి నుండి ఫోన్ పే ద్వారా పది వేల రూపాయలు వేసి తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఖాసీం వల్లి చేస్తున్న కృషి ని ఆయన అభినందించారు. అంతేగాకుండా భవిష్యత్తు లో తన వంతు సాయం అందించేందుకు ఎప్పుడూ తన చేతులు సిద్ధంగా ఉంటాయన్నాడు. పేద విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకూడదనేది తన అభిమతమన్నాడు. మండల విద్యా శాఖాధికారులు వారి చేతులు మీదుగా నోటు పుస్తకాలు, ఎక్కముల పుస్తకాలు, పెన్సిళ్ళు, ఎరేజర్లు, మెండర్లు,రంగు పెన్సిళ్ళు అందిస్తూ దాత జిలానీని మరియు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఖాసీం వల్లిని అభినందించారు. సమాజ మార్పు ఉపాధ్యాయుల కృషి తోనే సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లా.దస్తగిరి బాబు, ఉపాధ్యాయులు ఖాసీం వల్లి,మండల విద్యా శాఖాధికారులు మహమ్మద్ షఫీ, నిర్మల,సీ ఆర్ పి ఖాజా మొహియుద్దీన్,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో రూ.1000 కోట్ల స్థలాన్ని కాపాడిన హైడ్రా

హైదరాబాద్ శివార్లలోని ఐటీ కారిడార్‌లో భారీ కబ్జా యత్నాన్ని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) భగ్నం చేసింది. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో దాదాపు రూ.1,000 కోట్ల విలువైన ఐదెకరాల ప్రభుత్వ భూమిని అక్రమార్కుల చెర నుంచి విడిపించింది. ఈ స్థలంలో నిర్మించిన తాత్కాలిక షెడ్లు, గదిని కూల్చివేసి, భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది.మెటల్ చార్మినార్ నుంచి హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు వెళ్లే దారిలో ఉన్న సర్వే నంబర్ 42లోని ఈ విలువైన భూమిని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. చుట్టూ రేకులతో ఫెన్సింగ్ వేస్తుండగా రెవెన్యూ శాఖ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా సిబ్బంది, అక్రమ నిర్మాణాలను తొలగించి, ఇది ప్రభుత్వ భూమి అని సూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేసింది. మరోవైపు, రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మర్రిపల్లి గ్రామంలోని చెరువు కబ్జాను కూడా హైడ్రా అడ్డుకుంది. పట్టా భూమిలో ఆర్ఎంసీ యూనిట్ ఏర్పాటు చేసిన ఓ వ్యక్తి, వ్యర్థాలను చెరువులోకి డంప్ చేస్తూ సుమారు ఐదెకరాల చెరువు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించాడు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుతో హైడ్రా అధికారులు దర్యాప్తు చేసి, చెరువు శిఖం (ఎఫ్‌టీఎల్) పరిధిలో కార్మికుల కోసం నిర్మించిన షెడ్లను తొలగించారు.

నంది పత్రిక
గురువారం 25 - 06 -2026

# రెండు చుక్కలతో.. నిండు నూరేళ్ళ రక్ష !



జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశంలో.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**పల్స్ పోలియోను ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా చేపట్టాలి**

**జూన్ 28న బూత్ లెవెల్, 29, 30వ తేదీల్లో ఇంటింటికీ తిరుగుతూ పల్స్ పోలియో కార్యక్రమం**

**జిల్లా వ్యాప్తంగా 2404 బూత్ లు సిద్ధం**

**కడప, బ్యూరో చీఫ్ జూన్ 24 నంది పత్రిక :** రెండు చుక్కలతో.. నిండు నూరేళ్ళ రక్ష అని.. పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో.. ఈ నెల 28వ తేదీన నేషనల్ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా.. జిల్లాలో నిర్వహించే పల్స్ పోలియో ఏర్పాట్లపై సంబందిత అధికారులతో జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు.

**ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ..** ప్రజల భాగస్వామ్యంతోనే పోలియో నిర్మూలన వంద శాతం సాధ్యం అవుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చర్యల ద్వారా.. దేశ వ్యాప్తంగానే కాకుండా.. జిల్లాలో కూడా పోలియోను పూర్తి స్థాయిలో నిర్మూలించగలిగామన్నారు. పోలియో వైరస్ ప్రభావం ప్రస్తుతం మన చుట్టూ లేకపోయినప్పటికీ..

ముందస్తుగా ప్రతి ఒక్కబిడ్డను పోలియో నుండి రక్షించుకోవడం మన బాధ్యత అన్నారు. "నిండు జీవితానికి రెండు చుక్కలు" అన్న నినాదాన్ని సమాజంలో విస్తృత పరచడంలో జిల్లా ప్రజారోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఆశ, సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంపై విస్తృత ప్రచారం భాగంగా.. మీడియా కూడా తన వంతు బాధ్యత తీసుకోవాలని తెలియజేశారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఐదేళ్లలోపు వయస్సు గల 2,28,207 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 40 మండలాలు, 57 పల్స్ పోలియో ప్రణాళిక విభాగాల పరిధిలో మొత్తం 2,404 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వీటిలో 2,315 స్థిర కేంద్రాలు, 57 మొబైల్ కేంద్రాలు, 32 రవాణా కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణ కోసం 9,438 మంది టీకా సిబ్బంది, 232 మంది పర్యవేక్షకులు, 232 వాహనాలను వినియోగిస్తున్నామని తెలిపారు. చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా 4.20 లక్షల మోతాదుల పోలియో టీకాను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 197 డేంజర్ ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి, అక్కడ నివసిస్తున్న 1,425 మంది ఐదేళ్లలోపు చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు

గత విడతలో జిల్లాలో 100.03 శాతం లక్ష్య సాధన నమోదైందని, ఈసారి కూడా అదే స్థాయిలో విజయవంతం చేయడానికి వైద్య ఆరోగ్య శాఖ, అంగన్‌వాడీ, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం పోలియో మహమ్మారి ప్రభావం అంతగా లేనప్పటికీ.. కొన్ని ఊహించని సందర్భాల్లో వైరస్ సంక్రమణ జరిగే అవకాశం ఉన్నందున మనమందరం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతైనా అవసరం అన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బూత్ లతో పాటు మున్సిపాలిటీల్లోని వార్డుల్లో, గ్రామాల్లో, బస్టాండులు, రైల్వే స్టేషన్లు, ఎయిర్ పోర్టులు, వలస కూలీలు ఉన్న చోట, పబ్లిక్ అధికంగా ఉన్నచోట పోలియో చుక్కలు వేయడం జరుగుతోందన్నారు. జూన్ 28వ తేదీన మొబైల్ టీముల ద్వారా 29, 30వ తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వ్యాక్సినేషన్ చేయడం జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు.. ఉదయం 7 గం.ల నుండి సాయంత్రం 5 గం.ల వరకు పల్స్ పోలియో ప్రక్రియ నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ మూడు రోజులను ప్రతిఒక్కరూ అత్యంత బాధ్యతగా తీసుకుని భవిష్యత్తు తరాలకు సంపూర్ణ ఆరోగ్యకర పౌరులను అందిద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో కలిసి జాతీయ పోలియో గోడ పత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్ము నైజేషన్ అధికారి డా. రవిబాబు, ఐసీడీఎస్ పీడి రమాదేవి, ఆర్డీవో ప్రసాద్, రిమ్స్ సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు, రైల్వే, ఆర్టీసీ, ఐఎంఏ సభ్యులు, సంబంధిత టాస్కోర్స్ కమిటీ సభ్యులు, సంబందిత శాఖల అధికారులు, ఎన్జీవోలు తదితరులు పాల్గొన్నారు..



# నంద్యాల జిల్లా టిడిపి బలోపేతానికి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి





**ఓటర్ నమోదులో జాగ్రత్తలు వహించాలి**

**టీడీపీ పార్టీ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ఐక్యంగా పనిచేయాలి**

**నంద్యాల టిడిపి జిల్లా సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు మరియు ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి**

**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 24 ( నంది పత్రిక )** నంద్యాల తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు, పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అధ్యక్షతన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల నమోదు ప్రక్రియ (ఎస్ఐఆర్) పై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవడం, ఇప్పటికే ఉన్న ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓ) అందించే ఫామ్‌లను నింపేటప్పుడు ఎటువంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు వహించాలని, తద్వారా దరఖాస్తులు తిరస్కరణకు గురికాకుండా చూడాలని కార్యకర్తలకు స్పష్టం చేశారు. పార్టీ అధిష్టానం జారీ చేసే ప్రతి ఆదేశాన్ని, కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఉన్న ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా అమలు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ, తెలుగుదేశం పార్టీని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని, రాబోయే రోజుల్లో పార్టీ విజయానికి ఐక్యతతో కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి నాయకులు, పార్టీ కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**

**నంద్యాల బ్యూరో, జూన్ 24(నంది పత్రిక):-** ప్రజలకు, శిక్షణా కార్యక్రమాలకు హాజరయ్యే వారికి స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాలను కల్పించడం అభినందనీయమన్నారు. మానవ వనరుల అభివృద్ధి కేంద్రానికి ఆర్ఓ ప్లాంట్ కాంట్రాక్టర్ జగన్ రెడ్డి ఉచితంగా ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను అందించడం పట్ల ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. అలాగే సుమారు 2.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ఈ ఆర్ఓ ప్లాంట్ ద్వారా కేంద్రానికి వచ్చే అధికారులు, సిబ్బంది, శిక్షణార్థులు స్వచ్ఛమైన తాగునీటిని పొందగలరని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో స్వచ్ఛమైన తాగునీటి పాత్ర ఎంతో కీలకమని, ఇటువంటి కార్యక్రమాలు ఇతరులకు కూడా స్ఫూర్తిగా నిలుస్తాయని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొని ాా ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలను పరిశీలించారు.



## చదువు పేరుతో వ్యాపారం చేస్తున్న పోరుమామిళ్ల ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థ లపై చర్యలు తీసుకోవాలి.

**ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాల, సుమంత్,వీరపోగు రవి.**



**పోరుమామిళ్ల, జూన్ 24: (నంది పత్రిక):** విద్యతో తో వ్యాపారం చేస్తున్న పోరుమామిళ్ల ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థ ల పై చర్యలు తీసుకోవాలని బుధవారం పోరుమామిళ్ల స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు జాల సుమంత్, వీరపోగు రవి అన్నారు.

**సందర్భంగా వారు మాట్లాడుతూ......** పోరుమామిళ్ల పట్టణంలో ఉన్న ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థలు పూర్తిగా చదువు తో వ్యాపారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి వేల, లక్షల రూపాయలు దోపిడీ చేయడం జరుగుతుంది. అలాగే వారి విద్యా సంస్థ లకి ఎలాంటి గుర్తింపు లేకున్నా అన్ని ఉన్నాయని మోసం పూరిత మైన మాటలతో విద్యార్థుల ని మోసం చేస్తున్నారని వారన్నారు. అధిక ఫీజులు రాబడుతూ. పాఠ్య పుస్తకాలు, షూష్, ఇతల అన్ని కూడా వారి పాఠశాల లోనే కొనాలని హుకుమ్ జారీ చెయ్యడం జరుగుతుంది. దీని వల పాఠ్యపుస్తకాలు మరియు ఇతర సామాగ్రి కొనలేక విద్యార్థుల తల్లిదండ్రులు అల్లాడిపోవడం జరుగుతుంది. ఇవన్నీ తెలిసిన కూడా విద్యాశాఖ అధికారులు నిద్ర మత్తులో ఉండడం. అలాగే వారి పైన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం జరుగుతుంది. ఇవన్నీ చూస్తుంటే విద్యాశాఖ అధికారులు విద్యాసంస్థలకు కుమ్ముకొస్తున్నారని స్పష్టంగా అర్థమవుతుంది. ఇప్పటికైనా అధికారులు గుర్తింపు లేని విద్యాసంస్థలను సీజ్ చేసి మరియు అధికంగా ఫీజులు వసూలు చేసే విద్యా సంస్థల పైన వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల మండల సహాయ కార్యదర్శి ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన సేవా కార్యక్రమం

**4000 నోటు పుస్తకాలతో విద్యార్థులకు ఉత్సాహం**



**పోరుమామిళ్ల, జూన్ 24:నంది పత్రిక )** పోరుమామిళ్ల మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పసుపులేటి వెంకటమ్మ (సంటమ్మ) సేవా సంస్థ ఆధ్వర్యంలో నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ నిర్వాహకులు గడ్డం వెంకటరమణ సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది. మండలంలోని రాజాసాహెబ్‌పేట, ఏఏపాలెం, రంగసముద్రం ఎస్టీసీ, యరసాల హరిజనవాడ, పెద్ద యరసాల, బాలిరెడ్డిపల్లె, బొప్పాపురం, పోరుమామిళ్ల మెయిన్, సూరిసిద్దుపల్లె, తోకలపల్లె, నరసింగపల్లె, నాగలకుంట్ల, రామేశ్వరం, అక్కలరెడ్డిపల్లె, కమ్మవారిపల్లె, రేపల్లె, గానుగపెంట, కవలకుంట్ల, ఇందిరానగర్ తదితర గ్రామాల్లోని విద్యార్థులకు దాదాపు 4 వేల నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ కార్యనిర్వాహకుడు, ఉపాధ్యాయులు గుండెబోయిన శ్రీనివాసులు చేపట్టారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఏ. కొండిశెట్టి, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, అబ్దుల్ సత్తార్, మాధవి, పీర్ బాషా, రమణ, నాయబ్ రసూల్, రాంభూపాల్ రెడ్డి, గురయ్య, బాల చెన్నయ్య, విజయభాస్కర్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం పుస్తకాల దాతల సేవలను కొనియాడుతూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లను జిల్లా మండల విద్యాధికారులు అభినందన



**నంది పత్రిక ఆత్మకూరు...** కొట్టాలచెరువు గ్రామం ఆత్మకూరు మండల పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి పి జనార్దన్ రెడ్డి , ఎంఈఓ 1 శ్రీమతి మేరీ మార్గరెట్ , ఎంఈఓ 2 శ్రీ అయూబ్ , జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాల సమన్వయకర్త శ్రీ యం డీ ప్రసన్నకుమార్ , జిల్లా యం ఐ యస్ సమన్వయకర్త శ్రీ యస్ జగన్మోహన్ రెడ్డి సందర్శించడం జరిగింది.. ఈ గ్రామంలో త్వరలో ఏర్పాటు కానున్న పీఎం జన్మన్ వసతిగృహం గురించి వారికి అక్కడి సదుపాయాల గురించి వివరించారు, అందులో తమ పిల్లలను చేరుస్తామని తీర్మానం చేయించారు.. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ గ్రామంలో 100% పిల్లలు పాఠశాల లో నమోదు చేసినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు వారిని అభినందించడం జరిగింది...

# పెళ్లి వేడుకకు హాజరైన బుడ్డా శేషారెడ్డి



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 24:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న లింగాపురం గ్రామానికి చెందిన సగిలే కృష్ణారెడ్డి కుమార్తె వివాహానికి వైయస్సార్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి హాజరయ్యారు. ఆత్మకూరులో బుధవారం జరిగిన పెళ్లి వేడుకలు హాజరైన బుడ్డా శేషారెడ్డి నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ ముడిమెల పుల్లారెడ్డి, నారపురెడ్డి తులసి రెడ్డి, చింతకుంట నరసింహారెడ్డి,సగిలె కృష్ణారెడ్డి, ఎర్రం శంకర రెడ్డి, లింగాపురం శ్రీనివాసులు, తదితరులు హాజరయ్యారు.

# మోడల్ పాఠశాలల అభివృద్ధి పనులు చక్కటి ప్రణాళికతో చేపట్టాలి..!



## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప బ్యూరో చీఫ్, జూన్ 24: నంది పత్రిక** జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు ద్వారా ఎంపిక చేసిన పాఠశాలల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా, నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన.. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎంపిక చేసిన పాఠశాలల్లో చేపట్టనున్న పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మోడల్ పాఠశాలల అభివృద్ధి పనులకు సంబంధించి సమగ్ర ప్రణాళిక నివేదికలను సిద్ధం చేసి పనులను చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఎంపిక చేసిన 396 పాఠశాలల్లో అభివృద్ధి పనులన్నీ మండల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించాలని తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పురపాలక మరియు గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖల అధికారుల సమన్వయంతో పనులను అమలు చేయాలన్నారు.మోడల్ పాఠశాలలుగా గుర్తింపు పొందే పాఠశాలల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉత్తమ మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన వసతులు, అభివృద్ధి అవసరాలపై నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.మండల స్థాయి కమిటీలలో ఎంఈఓ-1, ఎంఈఓ-2లు, ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా పనులు నిర్వహించాలని తెలిపారు. రెండో దశ "మన బడి మన భవిష్యత్తు" కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న నిధులను సమర్థవంతంగా



వినియోగించేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేసి నాణ్యతను కాపాడాలని అధికారులకు సూచించారు. సమావేశంలో సమగ్ర శిక్ష అభియాన్ అదనపు పథక సమన్వయకర్త అనురాధ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ప్రధాన ఇంజినీరు ఏడుకొండలు, కడప పురపాలక సంస్థ ప్రధాన ఇంజినీరు చెన్నకేశవరెడ్డి, ఉప జిల్లా వ్యవసాయ అధికారి రాజగోపాల్ రెడ్డి, ఎంఈఓలు, మున్సిపల్, పీఆర్ ఇంజినీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# తంగడంచ చెరువుపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

**క్షేత్రస్థాయిలో చెరువు పనులపై కలెక్టర్ సమీక్ష**

**నీటి నిల్వ పెంపుపై అధికారులకు కలెక్టర్ కీలక ఆదేశాలు**

**చెరువు అభివృద్ధిలో నిర్లక్ష్యానికి తావులేదు**

**ప్రజల అవసరాలకు అనుగుణంగా చెరువు అభివృద్ధి పనులు**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**

**నంద్యాల బ్యూరో, జూన్ 24(నంది పత్రిక):-** జలధార - జలహారతి కార్యక్రమం కింద తంగడంచ చెరువులో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు శాశ్వత ప్రయోజనం కలిగించే విధంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో తంగడంచ చెరువు పరిధిలో చేపడుతున్న ఫీడర్ ఛానల్, నీటి ప్రవాహ మార్గాల అభివృద్ధి, చెరువు కట్టల బలోపేతం, నిల్వ సామర్థ్య పెంపు పనులపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, తంగడంచ చెరువు అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు ప్రయోజనం చేకూరేలా ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. చెరువులోకి నీటి ప్రవాహాన్ని మెరుగుపరిచే ఫీడర్ ఛానల్ పనులు పూర్తిస్థాయిలో అమలైతే గతంలో కంటే అధికంగా నీటి నిల్వ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కేవలం పనులు పూర్తి చేయడమే కాకుండా, వాటి ద్వారా చెరువు నిల్వ సామర్థ్యం ఎంత పెరుగుతుందో, భూగర్భ జలాల రీఛార్జ్ ఎంత మేరకు మెరుగుపడుతుందో స్పష్టమైన వివరాలతో అధికారులు నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. చెరువు పరిధి, ఫీడర్ ఛానళ్లు, సప్లై ఛానళ్లు, ఆక్రమణల వివరాలు,



ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం, అదనంగా సృష్టించగల నిల్వ సామర్థ్యం తదితర అంశాలపై సమగ్ర స్కెచ్‌లు రూపొందించాలని ఆదేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే శాఖలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. తంగడంచ చెరువును కేవలం అభివృద్ధి పనులకే పరిమితం కాకుండా గ్రామ ప్రజలు, రైతులకు ఉపయోగపడే ఆదర్శ జలవనరుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పేర్కొన్నారు. చెరువు అభివృద్ధి ద్వారా సాగునీటి లభ్యత పెరగడంతో పాటు భూగర్భ జలాల మట్టాలు మెరుగుపడేలా చర్యలు ఉండాలని తెలిపారు. డీఎంఎఫ్ నిధులతో చేపడుతున్న పనుల్లో ప్రతి రూపాయి ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా వినియోగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. పనుల అమలులో జాప్యం లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, నాణ్యతలో ఎటువంటి రాజీ ఉండకూడదని ఆదేశించారు. చెరువు పరిసరాల్లో అక్రమ తవ్వకాలు, ఆక్రమణలు, భూవినియోగ మార్పులపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువు భూముల పరిరక్షణకు సంబంధించి పూర్తి వివరాలను సేకరించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జలధార - జలహారతి కార్యక్రమం ద్వారా చెరువుల అభివృద్ధి, నీటి నిల్వ పెంపు, భూగర్భ జలాల రీఛార్జ్, గ్రామీణ జీవనోపాధి బలోపేతం లక్ష్యాల సాధనకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జలవనరుల ఎస్ఈ శివశంకర్, డ్వామా పీడీ సూర్యనారాయణ, భూగర్భ జల శాఖ డీడీ రఘురామ్, ఇరిగేషన్ డీఈ, ఎఈలు పాల్గొన్నారు.

# నంద్యాల లో వైద్య విద్యా సదస్సు





**నంద్యాల ఐఎంఏ, హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ అపోలో ఆసుపత్రి సంయుక్త నిర్వహణ**

**వక్తలుగా పాల్గొన్న హైదరాబాద్ అపోలో ఆసుపత్రి న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ రాహుల్ లక్ష్మీనారాయనన్**

**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 24 ( నంది పత్రిక )** నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ అపోలో ఆసుపత్రి సహకారంతో స్థానిక మధుమణి ఆసుపత్రి సమావేశ భవనంలో నంద్యాల ప్రాంత వైద్యులకు నిరంతర వైద్య విద్య సదస్సు నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు మాజీ ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని సదస్సు ప్రారంభించారు. హైదరాబాద్ అపోలో ఆసుపత్రి న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి,వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ రాహుల్ లక్ష్మీనారాయనన్ ముఖ్య వక్తలుగా పాల్గొని మల్టీమీడియా సహకారంతో ప్రసంగించారు. డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి ప్రసంగిస్తూ వెన్నెముక శస్త్ర చికిత్సలో నూతన విధానాలపై వైద్యులకు అవగాహన కల్పించారు. డాక్టర్ రాహుల్ లక్ష్మీనారాయనన్ మాట్లాడుతూ కాలు రక్తనాళాలలో రక్త సరఫరా సమస్యలు వచ్చినప్పుడు అనుసరించాల్సిన శస్త్ర చికిత్స విధానాలను వివరించారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ వైద్యులు ప్రాక్టీస్ చేసినంత కాలం తమ వైద్య పరిజ్ఞానాన్ని నిరంతరం పెంచుకుంటూ ఉండాలని, తద్వారా నూతన వైద్య విధానాలు, పరికరాలపై అవగాహన కలిగి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, ఐఎంఏ నంద్యాల మాజీ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు,రాష్ట్ర ఐఎంఏ మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్,అపోలో ఆసుపత్రి ప్రతినిధి రమణ, అధిక సంఖ్యలో నంద్యాల వైద్యులు, పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగు చేయాలి

**రుద్రవరం ప్రతినిధి జూన్ 24 (నంది పత్రిక):** ఎల్ నినో నేపథ్యంలో ఏడాది వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. మండల పరిధిలోని నరసాపురం ఆలమూరు గ్రామాలలో బుధవారం వ్యవసాయ అధికారులు రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ అధికారి సుమతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నంద్యాల డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మద్దిలేటి, నంద్యాల జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు చెన్నయ్య, ఆళ్లగడ్డ సహాయ వ్యవసాయ సంచాలకులు విజయ శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతన్న మీకోసం అనే కార్యక్రమం ప్రవేశపెట్టడం జరిగిందని ఈ కార్యక్రమంలో రైతులను చైతన్యవంతం చేస్తున్నామని తెలిపారు. ఏడాది ఖరీఫ్ సీజన్ పెట్టుబడి కొరకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కేంద్ర ప్రభుత్వం బియ్యం కిసాన్ సమ్మాన్ నిధి పథకాల ద్వారా 7000 రూపాయలు ఆన్లైన్లో రైతులకు జమ చేయడం జరిగిందన్నారు. రుద్రవరం మండలానికి సంబంధించి 9601 మంది అన్నదాత సుఖీభవ కింద 4.8 కోట్ల రూపాయలు, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా 1.6 కోట్ల రూపాయలు రైతుల అకౌంట్లో జమ చేయడం జరిగిందన్నారు. రైతులు రసాయనిక ఎరువులు విరివిగా వాడడం తగ్గించుకోవాలని తద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడాలని రైతులకు సూచించారు. నీటి వనరులను బట్టి దీర్ఘకాలిక పంటలు సాగు చేయకుండా స్వల్పకాలిక పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి రాజు, వ్యవసాయ సహాయకులు జయకృష్ణ, శ్రావణి, ఏపీ సీఎన్ ఎఫ్ సిబ్బంది శంకర్ ఆయాగ్రామాల రైతులు పాల్గొన్నారు.




# కెనరా బ్యాంక్ నూతన భవనం అట్టహాసంగా ప్రారంభం!

**అత్యాధునిక సౌకర్యాలతో ఖాతాదారులకు సేవలు**

**కెనరా బ్యాంక్ ప్రజల బ్యాంక్: ఏజీఎం సుశాంత్ కుమార్**

**ఉమ్మడి జిల్లాలో రూ.10 వేల కోట్ల టర్నోవర్**

**విద్యార్థులకు షూచికట్టు (కొలేటరల్) లేకుండానే రూ. 50 లక్షల వరకు విద్యా రుణాలు**



**వెలుగోడు, జూన్ 24 (నంది పత్రిక):** వెలుగోడు పట్టణంలో అన్ని రకాల అత్యాధునిక సదుపాయాలు, ఎయిర్ కండిషన్ సౌకర్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన కెనరా బ్యాంక్ భవనాన్ని బుధవారం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఏజీఎం) సుశాంత్ కుమార్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కెనరా బ్యాంక్ ఎల్లప్పుడూ ప్రజల బ్యాంక్‌గా సేవలందిస్తోందని కొనియాడారు. నంద్యాల, కర్నూలు జిల్లాల పరిధిలో మొత్తం 55 కెనరా బ్యాంక్ శాఖలు విజయవంతంగా నడుస్తున్నాయని చెప్పారు. ఇందులో భాగంగానే ఈరోజు నంద్యాల పట్టణంలోని రైతునగర్‌లో కూడా మరో నూతన కెనరా బ్యాంక్ శాఖను ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కెనరా బ్యాంక్ శాఖల ద్వారా ఏడాదికి సుమారు రూ.10 వేల కోట్ల టర్నోవర్ జరుగుతోందని ఏజీఎం సంతోషం వ్యక్తం చేశారు.

**అన్ని రకాల రుణ సదుపాయాలు.. విద్యార్థులకు బంపర్ ఆఫర్!** ఖాతాదారుల ఆర్థిక అవసరాల కోసం బ్యాంకులో గృహ, మార్టిగేజ్, అగ్రికల్చర్, బంగారం, పర్సనల్, వాహన, విద్యా రుణాలతో పాటు మరెన్నో వినూత్న సేవలు అందుబాటులో ఉంచామని సుశాంత్ కుమార్ తెలిపారు. ముఖ్యంగా ఉన్నత చదువులు చదవాలనుకునే విద్యార్థుల కోసం బ్యాంక్ అద్భుత అవకాశం కల్పిస్తోందని చెప్పారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ఎలాంటి కొలేటరల్ (హామీ/షూచికట్టు) లేకుండానే రూ.50 లక్షల వరకు విద్యా రుణాలు మంజూరు చేస్తున్నామని ఆయన వివరించారు.

**రూ.198 కోట్ల వ్యాపారంతో వెలుగోడు శాఖ ప్రగతి:** వెలుగోడు కెనరా బ్యాంక్ శాఖ గత 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.198 కోట్ల రికార్డు స్థాయి వ్యాపారం సాధించిందని ఏజీఎం కొనియాడారు. బ్యాంక్ ఇంతటి వ్యాపార అభివృద్ధిని సాధించడానికి వెలుగోడు మండల ప్రజలు, ఖాతాదారులు అందించిన సహకారమే ముఖ్య కారణమని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఖాతాదారుల సౌకర్యార్థం అన్ని హంగులతో ఈ నూతన భవనాన్ని తీర్చిదిద్దామని, రాబోయే రోజుల్లో బ్యాంకు మరింత అభివృద్ధి సాధించేందుకు ఖాతాదారులు తమ తోడ్పాటును ఇలాగే కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ కె. కళ్యాణ్ చక్రవర్తి, ఏఈఓ ఎ. లహరి, ఆఫీసర్ సోమన్న, మేనేజర్ పరశురాముడులతో పాటు బ్యాంక్ సిబ్బంది ఆసిఫ్ భాష, నాగరాజు, సుధాకర్, హుస్సేన్, కాశయ్య, ఆచారి, విజయ్ కుమార్, రమేష్ మరియు పెద్ద సంఖ్యలో బ్యాంక్ ఖాతాదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




## విపత్తు నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్**




**నంద్యాల బ్యూరో, జూన్ 24(నంది పత్రిక):-** జిల్లాలో సంభవించే ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 2026 సంవత్సరానికి సంబంధించిన రెండో విడత జిల్లా విపత్తు నిర్వహణ కమిటీ సమావేశాన్ని జెసి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాము నాయక్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, విపత్తుల ప్రభావాన్ని పూర్తిస్థాయిలో తగ్గించేందుకు శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమన్నారు. ముఖ్యంగా రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరదల వల్ల ప్రజలకు, పంటలకు ఎలాంటి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కుందూ నది నుంచి పాలేరు, మద్దిలేరు వాగుల ద్వారా వరద నీరు కాలనీలు మరియు గ్రామాల్లోకి ప్రవేశించకుండా గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద బండ్లు, రక్షణ గట్లు బలోపేతం చేయాలని ఆదేశించారు. మహానంది మండలంలో పాలేరు వాగు వరదల కారణంగా సుమారు ఐదు ఎకరాల మేర పంట నష్టం సంభవిస్తున్న నేపథ్యంలో, కల్వర్టుల ఎత్తును పెంచి పొలాల్లోకి నీరు చేరకుండా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే బనగానపల్లె మండలంలో లో- లెవల్ బ్రిడ్జిల వద్ద వరదల సమయంలో రాకపోకలకు అంతరాయం కలగకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆత్మకూరు మండలంలోని నిప్పులవాగు, కొత్తపల్లి మండలంలోని ఎద్దులపల్లి వాగు, భవనాశి వాగుల పరివాహక ప్రాంతాల్లో అధిక వర్షాల సమయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో కూడా విపత్తు నిర్వహణ కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడమే లక్ష్యంగా అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీ దాడుల కేసుల విచారణ వేగవంతం చేయాలి



## జిల్లాలో మతసామరస్యాన్ని కాపాడాలి : కలెక్టర్ నాగరాణి

**భీమవరం: బ్యూరో చీఫ్ జూన్ 24, నంది పత్రిక** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగే దాడులకు సంబంధించిన కేసుల విచారణను వేగవంతం చేసి బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు మతసామరస్యంతో జీవించాలని పిలుపునిచ్చారు. భీమవరం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సమావేశంలో కలెక్టర్ అధ్యక్షత వహించారు. సమావేశానికి రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి, ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజు, డీఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా అదనపు ఎస్పీ ధర్మవరపు విశ్వనాథ్, కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు, విచారణలో జాప్యానికి తావులేకుండా చూడాలని, ముఖ్యంగా ఎఫ్ఐఆర్ నమోదు, చార్జ్‌షీట్ దాఖలు దశల్లో వేగవంతమైన చర్యలు తీసుకోవాలని డీఎస్పీలను ఆదేశించారు. మార్చి 1 నుంచి జూన్ 15, 2026 వరకు జిల్లాలో 13 అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీటిలో నరసాపురం సబ్‌డివిజన్‌లో 5, భీమవరం సబ్‌డివిజన్‌లో 4, తాడేపల్లిగూడెం సబ్‌డివిజన్‌లో 4 కేసులు నమోదైనట్లు వివరించారు. బాధితులకు మానిటరీ రిలీఫ్ కింద ఎఫ్ఐఆర్ దశలో రూ.7.50 లక్షలు, చార్జ్‌షీట్ దశలో రూ.6 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని కమిటీ సభ్యులు సూచించారు. బడి బయట ఉన్న విద్యార్థుల జాబితాలను కమిటీ సభ్యులకు అందజేయాలని, ముఖ్యంగా తణుకు అరుంధతినగర్‌లో 8, 9, 10 తరగతుల విద్యార్థుల డ్రాప్‌అవుట్ సమస్యపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. పోలీసు, విద్యాశాఖ, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించి విద్య, ఉపాధి, సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం జరిగిన మాన్యువల్ స్కావెంజర్స్ సమావేశంలో జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్లు లేరని కలెక్టర్ తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం అందిస్తున్న రక్షణ పరికరాలను తప్పనిసరిగా వినియోగించేలా మున్సిపల్ కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసే సమయంలో ఫిర్యాదుదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రజలందరూ మతసామరస్యంతో జీవించి జిల్లాలో శాంతి, సామరస్య



వాతావరణాన్ని కొనసాగించాలని కోరారు. సమావేశంలో డీవీఎంసీ సభ్యులు కె.చిన్నపెద్దిరాజు, కె.రాజశేఖర్, ఎస్.జగపతి రామయ్య, ఎన్జీవో ప్రతినిధి వి.ఆశాజ్యోతి వివిధ సమస్యలను ప్రస్తావించారు. నరసాపురం సబ్‌డివిజన్‌లో అధిక సంఖ్యలో కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి అవసరమని సూచించారు. తణుకు అరుంధతిపేటలో నెలకొంటున్న ఘర్షణ వాతావరణంపై చర్యలు తీసుకోవాలని, తాడేపల్లిగూడెంలో త్రాగునీరు అందించిన విషయంలో జరిగిన వివాదాన్ని పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్డీవో బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా అడిషనల్ ఎస్పీ, తాడేపల్లి తాడేపల్లిగూడెం ఇంచార్జ్ డిఎస్పి ధర్మవరపు విశ్వనాథ్, ఆర్డీవో దాసిరాజు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.వి అరుణకుమారి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, తణుకు మున్సిపల్ కమిషనర్ రామ్ కుమార్, జిల్లా పరిశ్రమ శాఖ అధికారి యు.మంగపతి రావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ శ్రీనివాసరావు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పుష్ప రాణి, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, డిపిఓ కె. అనురాధ, డీవీఎంసీ సభ్యులు కె.చిన్నపెద్దిరాజు, కె.రాజశేఖర్, ఎస్.జగపతి రామయ్య, ఎన్జీవో ప్రతినిధి వి.ఆశాజ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

# స్పందించిన ఆర్ అండ్ బి అధికారులు..

## కొండమాయపల్లి వద్ద రోడ్డు మరమ్మతులు



**రుద్రవరం, జూన్ 24 (నంది పత్రిక):** రుద్రవరం మండలంలోని కొండమాయపల్లి సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డుపై ఏర్పడిన ప్రమాదకరమైన గుంతపై అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ విషయంపై 'నంది పత్రిక'లో వచ్చిన కథనానికి తక్షణమే స్పందించిన ఆర్ అండ్ బి అధికారులు, రోడ్డుపై ఉన్న గుంతను పూడ్చి, తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే చర్యలు తీసుకున్న అధికారుల తీరును స్థానిక ప్రజలు, ప్రయాణికులు అభినందించారు. ఈ మార్గంలో నిత్యం మహానంది, అహోబిలం వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే వాహనాలు, నిత్యం తిరిగే వేలాది వాహనదారులకు ఈ మరమ్మతులతో కొంత ఉపశమనం లభించినట్లయింది. భవిష్యత్తులో కూడా ఇటువంటి సమస్యలు తలెత్తకుండా రహదారిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు పంపిణీ



**మద్రిపాడు జూన్ 24నంది పత్రిక** : విద్యార్థులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో నందవరం ఆదర్శ పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయినిగా విధులు నిర్వర్తిస్తున్న వావినేని మాధవి లత తమ పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 593 మార్కులు సాధించి ప్రథమ స్థానం పొందిన గోవర్ధన్‌కు రూ.5,000,అలాగే 584 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన వసుధ,వాసీహ లకు ఒక్కొక్కరికి రూ.2,500 వంతున ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా మాధవి లత మాట్లాడుతూ,విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే గొప్ప విజయాలు సాధించగలరని అన్నారు.తాను ప్రభుత్వ సేవలో కొనసాగుతున్నంత కాలం ప్రతి సంవత్సరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.10,000 ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తానని ప్రకటించారు.విద్యార్థులను ప్రోత్సహించడం పట్ల ఆమె చూపుతున్న అంకితభావాన్ని కొనియాడుతూ పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ,సహచర ఉపాధ్యాయులు,విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఆమెను ఘనంగా అభినందించారు.

# సర్ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి



## లక్ష్యాల మేరకు త్వరితగతిన పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 24 నంది పత్రిక** ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నిర్దేశిత లక్ష్యాల మేరకు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా శుద్ధీకరణ, ఓటర్ల వివరాల నవీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం భీమవరం కలెక్టరేట్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన డీఆర్ఓ, మున్సిపల్ కమిషనర్లు మరియు సంబంధిత అధికారులతో సర్ (రాజూవఎిఖుశ్రీ ×త్వఅంఱజవ =వజఱంఱశీఅ) కార్యక్రమం పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సర్ కార్యక్రమం ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన అంశమని, దీనిని నిర్లక్ష్యం చేయకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో అమలు చేయాలని సూచించారు. ఇప్పటివరకు జరిగిన పురోగతిని సమీక్షిస్తూ, ఇంకా మిగిలి ఉన్న ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయాలని, ప్రజలకు ఫారాల ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు నమోదు చేయాలని తెలిపారు. సర్ ప్రక్రియకు సంబంధించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సందేహాలను వెంటనే పరిష్కరించాలని, ఎలాంటి సమస్యలు పెండింగ్‌లో ఉంచరాదని అధికారులకు సూచించారు. ప్రజలకు ఈ కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రచార వాహనాలు, సామాజిక మాధ్యమాలు, ముద్రిత ప్రచార సామగ్రి, స్థానిక సమావేశాలు వంటి అన్ని మార్గాలను వినియోగించాలని ఆదేశించారు. అలాగే ప్రతి బీఎల్‌వోకు అవసరమైన సహాయక సిబ్బందిని కేటాయించి క్షేత్రస్థాయి పనులు వేగవంతం చేయాలని సూచించారు. అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించి రోజువారీ పురోగతిని సమీక్షిస్తూ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఎటువంటి అర్హతలేని నమోదులు లేకుండా పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల సహకారంతో జిల్లాలో సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, తణుకు మున్సిపల్ కమిషనర్ రామ్ కుమార్, పాలకొల్లు, నరసాపురం మున్సిపల్ అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ప్రతి ఓటరికీ న్యాయం, ప్రతి ఇంటికీ సంక్షేమం:

## బూత్ స్థాయిలో సమన్వయంతో పార్టీని బలోపేతం చేయాలి

## ఓటరు జాబితా సవరణపై బీఎల్‌ఏలు ప్రత్యేక దృష్టి పెట్టాలి కోట్ల రాఘవేంద్ర రెడ్డి



**నంది పత్రిక –డోన్** గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అందించిన సుపరిపాలన, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని యువ నాయకులు కోట్ల రాఘవేంద్ర రెడ్డి పిలుపునిచ్చారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కోట్ల రాఘవేంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన నాయకత్వంలో గత రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతంగా అమలవుతున్నాయని కొనియాడారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తోందని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విప్లవాత్మక పథకాలను, సాధించిన విజయాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు."ప్రతి ఓటరికీ న్యాయం జరగాలి, ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాలి. ఆ దిశగానే మన ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.ఇదే సమయంలో ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) ప్రక్రియపై బూత్ లెవెల్ ఏజెంట్లు (బి ఎల్ ఏ ) పూర్తి అవగాహనతో పనిచేయాలని ఆయన కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. బూత్ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వలసల రామకృష్ణ, రాఘవేంద్ర గౌడ్, శేషు ఫణి గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, కాజా పీర్, సుదర్శన్,కుమ్మరిసుధాకర్, కొంగనపల్లి మధు,రామ్మోహన్,రఫీ, ప్రసాద్ రెడ్డి,ఎస్కె వలి, వెంకటేష్ పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల బారిన పడి యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు : అర్బన్ సీఐ అశోక్ కుమార్.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం.

**నందికొట్కూరు జూన్ 24(నంది పత్రిక )** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' (వ్యసన రహిత భారతదేశం) కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు బుధవారం నందికోట్కూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమంతో పాటుగా నందికొట్కూరు పట్టణంలో గవర్నమెంట్ జూనియర్ కళాశాల వద్ద నుండి పటేల్ సెంటర్ వరకు నందికోట్కూర్ అర్బన్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ అశోక్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. నేటి యువత దేశ భవిష్యత్తు అని, అటువంటి యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) బారిన పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు.మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యాలు క్షీణించడమే కాకుండా, కుటుంబాలు రోడ్డున పడతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.క్షణికానందం కోసం అలవాటు పడే వ్యసనాలు జీవితాంతం కోలుకోలేని దెబ్బ తీస్తాయని, విద్యార్థులంతా కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలే తప్ప ఇలాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్య రహిత జీవితాన్ని గడపాలని, సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయించినా లేదా రవాణా చేసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు.అనంతరం విద్యార్థులందరితో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, మరియు అధ్యాపక సిబ్బంది, అర్బన్ పోలీస్ సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతులకు రుణమాఫీ చేయాలి

## ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అన్నదాతను ఆదుకోవాలి

## 50 ఏళ్ళు దాటిన ఎస్సి ఎస్టీలకు పెన్షన్ ఇవ్వాలి...

## ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిమాండ్

## సిపిఐ కార్యాలయం లో కరపత్రాలు విడుదల..

**బనగానపల్లె జూన్ 24నందిపత్రిక** రాష్ట్రములో అప్పుల ఊబిలి చిక్కుక పోయిన అన్నదాతను ఆదుకునేందుకు ప్రభుత్వం 2లక్షల వరకు రైతు రుణమాఫీ చేయాలని బనగానపల్లె సీపీఐ పార్టీ మండల కార్యదర్శి శివయ్య డిమాండ్ చేశారు. బుధవారం శివయ్య విలేకరులతో మాట్లాడుతూ గత రెండేళ్లుగా మన రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన కూటమినేతలు రంగురంగుల హామీలు వాగ్దానాలు గద్దెక్కిన తర్వాత అటకెక్కాయి క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలు తీర్చడానికి ఎలాంటి చర్యలు తీసుకొని ప్రభుత్వం తాము పెద్ద ఎత్తున సంక్షేమం అందిస్తున్నామంటూ ప్రచారం మధ్యలో కోట్లాది రూపాయలతో ప్రచారాలు చేపట్టారు పంటకు కనీసం మద్దతు దక్కడం లేదు సిండికేట్ మార్కెట్ మాయాజాలంలో చిక్కుకుని రైతులు నష్టపోతున్నారు అన్నదాతలు ఆత్మహత్య చేసుకుంటున్నారు ఇక ఇక కౌలు రైతుల పరిస్థితి వర్ణనాతీతం తెలంగాణ రాష్ట్ర మాదిరిగా మన రాష్ట్రంలో రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసి ఆత్మహత్యల నుండి రైతాంగాన్ని కాపాడుకోవాలి ఇటీవల పెరిగిన ఎరువు పురుగుల మందు విత్తనాలు పెట్రోల్ డీజిల్ వ్యవసాయ యంత్ర పరికరాలు ధరలను తగ్గించాలని ఎన్నికల హామీ ప్రకారం కౌలు రైతులకు సులభతరంగా గుర్తింపు కార్డులు ( క్రాఫ్ట్ కల్టివేషన్ రైడ్స్ కార్డులు ) జారీ చేయాలని దేశానికి పట్టెడన్నం పెట్టే రైతన్నకు 50 సంవత్సరాలు నిండిన వారికి పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని వారన్నారు. అదేవిదంగా ఈ నెల 30 న నిర్వహించే ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో సుబ్బయ్య రాజు ఆచారి పాల్గొన్నారు



# ప్యాపిలిలో 'సర్' కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన డోన్ ఆర్ డి ఓ పి. నరసింహులు

**నంది పత్రిక –ప్యాపిలి** ప్యాపిలి పట్టణంలో ప్రస్తుతం కొనసాగుతున్న 'సర్' కార్యక్రమ నిర్వహణను డోన్ ఆర్డీఓ పి. నరసింహులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని వివిధ పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ స్థాయి అధికారులు బూత్ స్థాయి ఏజెంట్లు నిర్వహిస్తున్న ఓటర్ల పునశ్చరణ ధృవీకరణ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆర్డీఓ స్థానిక ఓటర్లను కలిసి, వారికి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. కార్యక్రమ పురోగతిపై బీఎల్ఓలతో సమీక్ష నిర్వహించి, వారికి పలు కీలక సూచనలు జారీ చేశారు.

**త్వరితగతిన డిజిటలైజేషన్ పూర్తి చేయాలి:** ఆర్డీఓ శ్రీ పి. నరసింహులు మాట్లాడుతూ.. ఓటరు జాబితా పారదర్శకతకు ఈ కార్యక్రమం ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, సేకరించిన వివరాల డిజిటలైజేషన్‌ను ఎలాంటి తప్పులు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిషోర్ కుమార్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ రెడ్డి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుజాత బాయ్, బీఎల్ఓలు, బీఎల్ఏలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ పత్రాలు అందించాల్సిందే





## సర్ ప్రక్రియపై ప్రతి ఓటరకు అవగాహన కల్పించాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 24 నంది పత్రిక** ప్రత్యేక సంక్షిప్త సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ పత్రాలను స్వయంగా అందజేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం భీమవరం పట్టణంలోని నరసయ్య అగ్రహారం 4వ, 5వ డివిజన్లలో కొనసాగుతున్న సర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. బీఎల్‌వోలు గృహాలను సందర్శించారా, ఎన్యుమరేషన్ ఫారాలు అందజేశారా, 2002 ఓటర్ల జాబితా ప్రకారం నమోదైన ఓటర్లు ప్రస్తుతం అదే చిరునామాలో నివసిస్తున్నారా లేదా ఇతర ప్రాంతాలకు మారారా వంటి అంశాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. కొన్ని గృహాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ స్థానిక ఓటర్లతో మాట్లాడి సర్ ప్రక్రియ ప్రాముఖ్యతను వివరించారు. అలాగే ఎన్యుమరేషన్ పత్రాలను స్వయంగా అందజేస్తూ వాటిని సకాలంలో పూర్తి చేసి బీఎల్‌వోలకు అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో సర్ ప్రక్రియ మందకోడిగా కొనసాగుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. బీఎల్‌వోలు కేవలం ఫారాలు పంపిణీ చేయడమే కాకుండా ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను ధృవీకరించాలని సూచించారు. ఇంకా పూర్తి కాని ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సర్ ప్రక్రియ జరుగుతున్న విషయం ప్రతి పౌరుడికి తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. తుది ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత తమకు సమాచారం లేదని ఎవరూ చెప్పకుండా ముందస్తు అవగాహన కల్పించాలన్నారు. ఈ ప్రక్రియ ఎందుకు చేపడుతున్నామో, దీని వల్ల ఓటర్ల జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా ఎలా రూపొందుతుందో ప్రజలకు వివరించాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలు అందిన వెంటనే వాటి డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డేటా నమోదు పనులు వేగవంతంగా పూర్తయ్యేలా అవసరమైన మేరకు అదనపు డీటీపీ ఆపరేటర్లను నియమించి విధులు కేటాయించాలని సూచించారు. ప్రతి దశలో పర్యవేక్షణ కొనసాగిస్తూ నిర్ణీత గడువులోపు లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా నాణ్యతను మెరుగుపరచడంలో సర్ ప్రక్రియ కీలకమని పేర్కొన్న కలెక్టర్, ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సహాయ మున్సిపల్ కమిషనర్ ఎ.రాంబాబు, బీఎల్‌వోలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# మొహర్రం వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి: ఎస్సై నాగార్జున



**నందిపత్రిక -ప్యాపిలి** మొహర్రం వేడుకలను శాంతియుతంగా, పరస్పర సామరస్య వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్యాపిలి ఎస్సై నాగార్జున కోరారు. బుధవారం మండల పరిధిలోని ఎన్.రంగాపురం, మెట్టుపల్లి, ఏనుగుమర్రి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి, గ్రామ పెద్దలు, మత పెద్దలు, యువతతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై నాగార్జున మాట్లాడుతూ.. పండుగ సందర్భంగా నిర్వహించే ఊరేగింపులు, మతపరమైన కార్యక్రమాల గురించి ముందస్తుగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అధికారులు నిర్ణయించిన, అనుమతించిన మార్గాల్లోనే ఊరేగింపులు సాగాలని స్పష్టం చేశారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు:** సోషల్ మీడియాలో మత విద్వేషాలు రేకెత్తించే వ్యాఖ్యలు, రెచ్చగొట్టే ప్రసంగాలు, అభ్యంతరకర పోస్టులు పెడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వేడుకల పేరుతో యువత ప్రమాదకర విన్యాసాలు చేయరాదని, అధిక శబ్దాలు వచ్చే సౌండ్ సిస్టమ్‌లను వినియోగించకూడదని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి అనుమానాస్పద ఘటనలు వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మైనర్ పిల్లలు సరదా కోసం ద్విచక్ర లేదా ఇతర వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని ఆయన స్పష్టం చేశారు."మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే.. వాహన యజమానులు, వారి తల్లిదండ్రులపై కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయి. భారీ జరిమానాతో పాటు జైలు శిక్ష పడే అవకాశం కూడా ఉంది. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు ఎవరూ వారికి వాహనాలు ఇవ్వకూడదు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దు...

## డీఎస్పీ శ్రీనివాసరావు



**చాగలమర్రి జూన్ 24 నంది పత్రిక** శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా శాంతియుతంగా మొహరం పండుగను జరుపుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ రూరల్ సీఐ బివి రమణతో కలిసి బుధవారం పండుగ కమిటీ సభ్యులతో సమావేశమై మాట్లాడారు. మతాలకు కులాలకు అతీతంగా మతసామరస్యానికి ప్రతికగా పూర్వం నుండి జరుపుకునే పండుగలు అందరికీ ఆదర్శంగా ఉండాలని సూచించారు. పండుగ సందర్భంగా అల్లర్లు సృష్టించిన, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మొహరం పండుగ పర్యవేక్షణలో సీఐ రమణ కూడా ఉంటారన్నారు. మొహరం పండుగలో పోలీస్ బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు సీసీ కెమెరాల ద్వారా సమాచారాన్ని స్థానిక ఎస్సై రాజారెడ్డి సేకరించి పోలీసు ఉన్నతాధికారులకు నివేదికలు ఇస్తారన్నారు. ఈ సమావేశంలో మొహరం పండుగ కమిటీ కార్యనిర్వాహకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మంగళగిరిలో ఏపీఎల్ సందడి... ట్రోఫీ ఆవిష్కరించిన రామ్ చరణ్

టాలీవుడ్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ బుధవారం మంగళగిరిలో సందడి చేశారు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) చివరి దశ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఏపీఎల్ ట్రోఫీని, జట్ల జెర్సీలను ఆయన ఆవిష్కరించారు.

# గుండెపోటుతో వీఆర్వో మృతి

### -పని భారంతోనే గుండెపోటు గుర్రైన వైనం

### -చికిత్స పొందుతూ మృత్యువాత పడిన వీఆర్వో శ్రీనివాసులు



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలంలోని గోకవరం గ్రామ పంచాయతీలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు బుధవారం మృత్యువాత పడిన సంఘటన చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెలితే మండలంలోని ఎర్రమటం గ్రామనికి చెందిన శ్రీనివాసులు(51) గ్రామంలోనే వీఆర్‌ఏగా విధులు చేస్తూ ఉండేవాడు. పదోన్నతిలో భాగంగా 2008 సంవత్సరంలో మండలంలోని ముసలిమడుగు గ్రామానికి మొదటిగా వీఆర్వోగా భాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి వెలుగోడు, ఆత్మకూరు మండలంలోని దుద్యాల గ్రామాలలో వీఆర్వోగా విదులు నిర్వహించారు. సాధారణ బదిలీలలో భాగంగా మండలంలోని గోకవరం గ్రామపంచాయతీలో విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం ఆర్ఐ ఎస్సార్. పి జి ఆర్ఎస్. కీ సర్వే పనులు ఎక్కువగా ఉండడంతోపాటు సిబ్బంది తక్కువ ఉండడంతో రీసర్వే ఒక వీఆర్వోకు రెండుగ్రామాలు ఇవ్వడం జరిగింది. అన్ని పనులు, సర్వేల పనిఒత్తిడితో తీవ్ర మనోవేదనకు గుర్రైన వీఆర్వో శ్రీనివాసులు మంగళవారం ఉన్నట్టుండి ఆకస్మత్తుగా గుండెపోటుకు గురిఅయ్యాడు. దీంతో ఆయనను కుటుంబ సభ్యుల సహకారంతో కర్నూలుకు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ ఓ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం మృత్తువాత పడినట్లు తెలుస్తుంది. విషయం తెలుసుకున్న రెవెన్యూడివిజన్ అధికారి వెంకటశివ, తహసీల్దార్ ఉమారాణి, డీప్యూటీ తహసీల్దార్లు పెద్దన్న, అరుణలతో కలసి వీఆర్వో స్వంత గ్రామమైన ఎర్రమఠం గ్రామం చేరుకొని మృతుడు శ్రీనివాసులు మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబాన్ని పరామర్శించారు. భూ స్థాపన నిమిత్తం రూ.25000 అందించారు. ఇలా ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులపై సర్వేలు, పనుల భారం మోపుతూ వారి జీవితాలతో చలగాటం ఆడుతున్నదని ప్రజలు, తోటి ఉద్యోగులు బహిరంగంగా చర్చించుకోవడం గమనార్హం. ప్రభుత్వ ఉద్యోగులపై పనులు, సర్వేల భారం తగ్గించి ఉద్యోగులను కాపాడాలని ప్రజలు, తోటి ఉద్యోగులు కోరుతున్నారు.



# ఎస్సీ ఎస్టీ నిధులను విడుదల చేయాలి..

## మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు



**బనగానపల్లె జూన్ 24 నంది పత్రిక** ఎస్సీ ఎస్టీ కేసులలో బాధితులైన వారికి నిధులను విడుదల చేయాలని రాష్ట్ర సంఘం అధ్యక్షులు కేడియం సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని కోరారు. బనగానపల్లెలో బుధవారం సంఘం సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వము అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎస్సీ ఎస్టీలకు రావలసినటువంటి నిధులను ఆపివేసిందని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రుణాలు కూడా ఆగిపోయాయని దీంతో ఎస్సీ ఎస్టీలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్వయం ఉపాధి కింద యూనిట్లు పెట్టుకొని ఎందుకు కూడా ప్రభుత్వం నుండి ఎటువంటి సబ్సిడీ రుణాలు మంజూరు కావడం లేదని ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేయాలని కోరారు అదే సమయంలో ఎస్సీ ఎస్టీల కేసులలో బాధితులైన వారికి వచ్చే నిధులు కూడా ఆగిపోయాయని ప్రభుత్వ వెంటనే ఈ నిధులను విడుదల చేసి బాధ్యతలను ఆదుకోవాలని లేనిపక్షంలో సంఘం తరపున జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కేడెం సుబ్బరాయుడు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## పొరపాటున పాక్ గగనతలంలోకి ఎయిరిండియా విమానం.. విచారణకు ఆదేశం

ఢిల్లీ నుంచి అమృత్‌సర్‌కు వెళుతున్న ఎయిరిండియా విమానం ఒకటి పొరపాటున పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించింది. అమృత్‌సర్ విమానాశ్రయంలో ల్యాండింగ్ చేసే ప్రయత్నంలో భాగంగా 'గో-రౌండ్' (తిరిగి గాల్లోకి లేవడం) చేస్తుండగా సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. టాటా గ్రూప్‌కు చెందిన ఎయిరిండియా ఈ విషయాన్ని ఒక ప్రకటనలో ధృవీకరించింది. విమాన సిబ్బంది ఏఐ479 విమానాన్ని అమృత్‌సర్‌లో ల్యాండ్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా, సాంకేతిక కారణాలతో గో-రౌండ్ చేయాల్సి వచ్చిందని, ఈ క్రమంలో పాక్ గగనతలంలోకి కొద్ది దూరం ప్రవేశించిందని సంస్థ తెలిపింది. ఈ ఘటనపై సంబంధిత నియంత్రణ సంస్థలకు సమాచారం అందించామని, సంస్థాగతంగా కూడా అంతర్గత విచారణ జరుపుతున్నామని ఎయిరిండియా పేర్కొంది. ప్రయాణికుల భద్రతకే తమ తొలి ప్రాధాన్యమని స్పష్టం చేసింది. 2025 ఏప్రిల్‌లో జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి, సరిహద్దు ఉద్రిక్తతల తర్వాత పాకిస్థాన్.. భారత్‌కు చెందిన అన్ని రకాల సివిల్, మిలటరీ విమానాలపై తమ గగనతలాన్ని మూసివేసింది. ఈ నిషేధాన్ని నెలనెలా పొడిగిస్తూ వస్తోంది. ఇటీవలే ఈ నిషేధాన్ని జూలై 24 వరకు పొడిగించినట్లు పాకిస్థాన్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ప్రకటించింది. భారత్ కూడా పాక్ విమానాలపై ఇదే తరహా నిషేధాన్ని అమలు చేస్తోంది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# నంద్యాల పార్లమెంట్ జనసేన పరిశీలన సాదక్ గా పసుల నరేంద్ర యాదవ్.



**శిరివెళ్ల (నంది పత్రిక):** జనసేన పార్టీ సీనియర్ యువ నేత శిరివెళ్ల నివాసి జేఎస్పి ఆవిర్భావం నుండి నేటి వరకు పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పసుల నరేంద్ర యాదవ్ అంకిత భావాన్ని పార్టీ అధిష్టానం గుర్తించింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఎంపీ బాలశౌరి నంద్యాల పార్లమెంట్ సమాచార నిర్మాణ సారధిగా నియోజకవర్గ పరిశీలకులుగా నియమించి సముచిత స్థానం కల్పించింది. ఈ సందర్భంగా పార్టీ అధిష్టానం నుండి అధికారికంగా ప్రకటన వెలువడడంతో జనసేన పార్టీ యువనేత పసు ల నరేంద్ర యాదవ్ అభిమానులు కార్యకర్తలు ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని శిరివెళ్ల మండల కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు.జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసి, జనసైనికుల నుంచే భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో ఎంపీ బాలశౌరి స్వీయ పర్యవేక్షణలో జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీలను నియమించింది.పార్టీ పట్ల నిబద్ధత, స్థానిక అంశాలపై అవగాహన కలిగిన పశుల నరేంద్ర యాదవ్ ను నంద్యాల జిల్లా పార్లమెంట్ నియోజకవర్గానికి జనసేన పార్టీ నిర్మాణ సారధిగా బాధ్యతలు అప్పగించడం విశేషం. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పార్టీ కోసం అంకితభావంతో కష్టపడిన నరేంద్ర యాదవ్ కు జనసైనికుల సమాచారం సేకరణ బాధ్యతలు సైతం అప్పగించింది.2014 నుండి జనసేన జెండాను మోస్తున్న జనసైనికులను నాయకులుగా తీర్చిదిద్దేలా పార్టీ నిర్మాణం పార్లమెంట్ నుండి గ్రామ స్థాయి వరకు, అలాగే వివిధ విభాగాలలో పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారికి, వారి ఆసక్తికి తగిన విధంగా బాధ్యతలు అప్పగించేలా పార్టీ అధిష్టానానికి నివేదిక పంపే బాధ్యత నరేంద్ర యాదవ్ కు అప్పగించింది. జనసైనికులలోని నాయకత్వ లక్షణాలు, నైపుణ్యం, అంకితభావాన్ని గుర్తించి వారికి నాయకత్వ అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎంపీ బాలశౌరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ గారికి ఎంపీ బాలశౌరి గారికి ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన పార్టీ ఇంచార్జ్ చింతల సురేష్ బాబు గారికి పార్టీ అధిష్టానానికి నరేంద్ర యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి యువత ముందుకు రావాలి. కర్నూలు మూడవ పట్టణ సీఐ శేషయ్య




**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మూడో పట్టణ సీఐ శేషయ్య విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలు, నార్కో టెర్రరిజం ముప్పుపై అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండి దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎన్ డి పి యస్ యాక్ట్ -1985, ఈగల్ విభాగం చేపడుతున్న ప్రత్యేక ఆపరేషన్లు, డ్రగ్స్ సమాచారానికి ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 వినియోగంపై వివరించారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ ఇంచార్జ్ డాక్టర్ అక్తార్ భాను , ఈగల్ టీం హెడ్ కానిస్టేబుల్ ఎలిషా ,కానిస్టేబుల్ మాసూమ్ వలి. స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ కోఆర్డినేటర్ శివ శంకర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సుందరీకరణను పాడు చేసే వారిపై కఠిన చర్యలు

## కలెక్టరేట్ ప్రాంగణంలో వాల్ పోస్టర్లు తొలగింపు

## కర్నూలు నగరపాలక సంస్థ కమీషనర్ చల్లా ఓబులేసు



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు నగర సుందరీకరణను పాడు చేసే వారిని గుర్తించి కఠిన తీసుకోక తప్పదని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో గోడలపై ఉన్న పోస్టర్లను తొలగింపజేశారు. గాయత్రి ఎస్టేట్, బుధరపేట ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని ముఖ్య కూడళ్లలో, డివైడర్ల మధ్య స్తంభాలపై, గోడలపై రాజకీయ పార్టీలు, మత సంస్థలు, ప్రైవేటు సంస్థలు, బ్యానర్లు, సినిమా పోస్టర్లు అతికించడం వల్ల లక్షలాది రూపాయల ప్రజాధనంతో చేపట్టిన సుందరీకరణ పనులు పాడు అవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు సైతం చట్ట విరుద్ధ చర్యలను అడ్డుకోవాలని కోరారు. ట్రాఫిక్ సిగ్నల్స్, సీసీ కెమెరాల వద్ద బ్యానర్లు అడ్డుగా ఉండటం వల్ల ట్రాఫిక్ అంతరాయం, ప్రమాదాలు సంభవించిన సందర్భాల్లో విచారణకు అవసరమైన కెమెరా దృశ్యాలు దొరకకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని కమిషనర్ తెలిపారు. నగర సుందరీకరణను కాపాడేందుకు ప్రతి సంస్థ నగరపాలక సంస్థకు సహకరించాల్సిన బాధ్యత ఉందని సూచించారు. దీనిని ఎవరైనా అతిక్రమించి నగర సుందరీకరణ పనులకు భంగం కలిగిస్తే, మున్సిపల్ కౌన్సిల్ సి.ఆర్.నెం:78 ప్రకారం భారీ జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

## ఓటర్ సవరణను జాగ్రత్తగా పరిశీలించండి....

**చాగలమర్రి జూన్ 24 నంది పత్రిక** మండలంలో జరుగుతున్న ఓటర్ సవరణ కార్యక్రమంలో జాగ్రత్తలు పాటించి తమ ఓటు హక్కును పొందాలని తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు యాదవ్ సూచించారు. బుధవారం కాలమారి పట్టణంలో ఓటర్ సవరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఓటర్లకు తమ ఓటు గుర్తింపు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తమ ఓటును నిలుపుకునేందుకు దగ్గర తమ గుర్తింపు కార్డులను అందజేసి ఓటును పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ గృహకల్ప లబ్ధిదారులకు తక్షణమే బిల్లులు మంజూరు చేయాలి: సిపిఐ ఎమ్ ఎల్ లిబరేషన్.



**నందికొట్కూరు జూన్ 24(నంది పత్రిక )** ఎన్టీఆర్ గృహకల్ప కింద గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వం తక్షణమే బిల్లులు మంజూరు చేయాలని సిపిఐ ఎమ్ ఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్ గృహకల్ప లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ పట్టణంలోనే హౌసింగ్ కార్యాలయం ముందు సిపిఐ ఎంఎల్ లిబ్రేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లింగాల శ్రీనివాస్ అధ్యక్షతన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కార్యదర్శి పికిల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలోని ఇల్లు లేని నిరుపేదలకు ఎన్టీఆర్ గృహ కల్ప కింద 407 మందికి ప్రభుత్వం గృహాలు మంజూరు చేయడం జరిగింది అన్నారు. మంజూరైన లబ్ధిదారులు ఎన్నో ఆర్థిక వ్యయ ప్రయాసలతో ఇంటి నిర్మాణాలు చేపడితే 130 మంది లబ్ధిదారులకు మాత్రమే బిల్లులు మంజూరు అయ్యాయని, ఇంకా 277 మందికి బేస్ మట్టం బిల్లు కూడా పడలేదన్నారు. అప్పులు తెచ్చి మరి పాదులు బేస్ మట్టం నిర్మించుకున్న పొజిషన్ సర్టిఫికెట్ లేదన్న కారణంతో బిల్లులు మంజూరు కాకపోవడం అధికారుల నిర్లక్ష్యం లబ్ధిదారులకు శాపంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ ఎమ్మార్వో పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం తీవ్ర బాధాకరమన్నారు. జిల్లా కలెక్టర్ కు లబ్ధిదారుల సమస్యలపై వినతి పత్రాలు అందజేసిన పరిష్కారము కాకపోవడం దురదృష్టకరమన్నారు. ఇకనైనా జిల్లా ఉన్నత అధికారులు స్పందించి ఎన్టీఆర్ గృహ కల్ప కింద గృహాలు నిర్మించుకున్న ప్రతి లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్ తో పాటుగా బిల్లులు మంజూరు చేయాలని వారి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఎన్టీఆర్ గృహ కల్ప లబ్ధిదారులతో కలిసి ధర్నా కార్యక్రమం చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు సోమన్న, లింగాల శ్రీనివాసులు, వద్దే శ్రీరాములు, సుధాకర్, ప్రసాద్, లబ్ధిదారులు లింగాల లక్ష్మీదేవి, రజియాబి, చెన్నయ్య, రాజేష్, సూరి తదితరులు పాల్గొన్నారు.

# కర్నూల్ లో హైకోర్టు బెంచ్ త్వరగా ప్రకటించాలి జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి చంద్రుడు




**కర్నూలు సిటీ నందిపత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాయలసీమలోని జొన్నగిరి ప్రాంతానికి అభివృద్ధి నేపథ్యంలో బంగారు వ్యాపారరీత్యా ఏర్పాటు చేయడానికి వస్తున్న సందర్భంగా కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం విలేఖరి సమావేశంలో మాట్లాడుతూ బి చంద్రుడు కే ఓంకార్ టిడిపి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అయినప్పటికీ కర్నూల్లో హైకోర్టు బ్రాంచ్ నేటి వరకు ప్రారంభం కాలేదని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నటువంటి న్యాయవాదులు ముఖ్యమంత్రి రాజకీయ పరిపాల పరిపక్వత కలిగినటువంటి అన్ని విషయాల పట్ల అవగాహన ఉండి దేశ రాజకీయాలలో కీలక పాత్ర వహిస్తున్నటువంటి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒక ప్రాంతంలో హైకోర్టు బెంచ్ అమలు చేయడంలో ఆలస్యం జరుగుటంవల్ల రాయలసీమలో న్యాయవాదులకు చాలా సమస్యలు ఉన్నప్పటికీ హైకోర్టు బెంచ్ విషయంలో త్వరగా ఏర్పాటు చేయించి ఆశిస్తున్నామని కర్నూలు జిల్లా న్యాయవాదులుగా ముఖ్యమంత్రి రాయలసీమ పర్యటన పట్ల విలేకరుల సమావేశం లో కలవడానికి అనుమతి నిరాకరించినందుకుగాను కనీసం విలేకరుల సమావేశ ద్వారా కర్నూలు జిల్లా న్యాయవాదుల యొక్క జటిల్ల సమస్యను తక్షణమే కర్నూల్ లో హైకోర్టు బెంచ్ అమలయ్యే విధంగా చొరవ చూపాలని నేడు కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం కార్యాలయం నందు నిరసన ప్రకటించారు పై సమావేశంలో కే ఓంకార్ ఎస్ రాజేష్ బాబు ఎం సుబ్బయ్య కృష్ణమూర్తి నిత్యజీవన్రాజు ఎం రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కేఎంసిలో 250 ఎంబిబిఎస్ సీట్లకు పునరుద్ధరణ ఎన్ ఎమ్ సి అనుమతి కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ

**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు మెడికల్ కాలేజీలో ప్రస్తుతం ఉన్న 250 మెడికల్ సీట్లను తిరిగి పునరుద్ధరిస్తు నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతి మంజూరు చేయడం జరిగింది అని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కర్నూల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కి చిట్టి నరసమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఎటువంటి సీట్ల సీట్ల కోత లేకుండా 250 సీట్లకు కొనసాగించవచ్చు నని తెలిపారు.. సాంకేతిక పరమైన లోటుపాట్ల కు సంబంధించి 45 రోజుల్లోపుగా పునరుద్ధించుకోవాలని సూచించింది అని అయితే పూర్తిస్థాయి వివరాలను ఇప్పటికే అందజేశామని వాటిని మరొకసారి తెలియజేస్తూ ఎన్ ఎం సి కి లేఖ రాస్తామని ఆమె తెలిపారు. అవసరమైన అన్ని వసతులను కూడా త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. వైద్య విద్యలో ప్రమాణాలు తగ్గకుండా ఉండేందుకు నిరంతరం మెడికల్ కాలేజీ లను నేషనల్ మెడికల్ కౌన్సిల్ పర్యవేక్షణ చేస్తూ ప్రమాణాలకు తగ్గట్టుగా ఉంటేనే సీట్ల పునరుద్ధరణకు అనుమతి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

# మొహరం పండుగకు హాజరుకానున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి

**చాగలమర్రి జూన్ 24 నంది పత్రిక** నేడు జరగనున్న మొహరం పండుగకు మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి హాజరవుతున్నట్లు వైఎస్ఆర్పిపి నాయకులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా గంగుల ప్రభాకర్ రెడ్డిని పూలమాలలతో సత్కరించి ఆహ్వానించారు. ప్రజా ప్రతినిధులకు ప్రత్యేకించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



# బస్సు పునరుద్ధరణ కోసం మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట విద్యార్థుల నిరసన




**మద్రిపాడు జూన్ 24నంది పత్రిక :** రద్దు చేసిన పాఠశాల బస్సును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ చుంచులూరు,పడమటి నాయుడుపల్లి పంచాయతీలకు చెందిన నందవరం మోడల్ స్కూల్ విద్యార్థులు బుధవారం మర్రిపాడు మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ,నందవరం మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన ఏపీఎస్ఆర్టీసీ బస్సును రద్దు చేయడంతో ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లడం కష్టంగా మారిందన్నారు.బస్సు లేకపోవడంతో పాఠశాలకు వెళ్లడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వ విజయోత్సవ వేడుకల సందర్భంగా ఆత్మకూరుకు విచ్చేసిన దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి తమ సమస్యను వివరించినట్లు తెలిపారు.దీనిపై స్పందించిన మంత్రి,విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించే బాధ్యత తనదని హామీ ఇచ్చి,విద్యార్థులు నిరంతరం పాఠశాలకు హాజరై బాగా చదువుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు.అంతేకాకుండా పాఠశాల బస్సు పునరుద్ధరణకు సంబంధించి ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌కు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు విద్యార్థులు తెలిపారు.అయితే మంత్రి ఆదేశాలు జారీ చేసి పది రోజులు గడిచినప్పటికీ డిపో మేనేజర్ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టినట్లు వెల్లడించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాల బస్సును వెంటనే పునరుద్ధరించాలని వారు ప్రభుత్వాన్ని,ఆర్టీసీ అధికారులను కోరారు.ఈ నిరసనలో విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత...

## 500 మంది పోలీసులతో భారీ బందోబస్తు

## పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలి...

## మంత్రాలయంలోని రివేరా ఫంక్షన్ హాల్లో భద్రతా విధులపై దిశానిర్దేశం చేసిన నంద్యాల ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్



**కర్నూలు సిటీ నందిపత్రిక** జూన్ 25వ తేదీన మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేయనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించి బందోబస్తు విధుల నిమిత్తం వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి మంత్రాలయంలోని రివేరా ఫంక్షన్ హాల్లో నంద్యాల ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ బుధవారం భద్రతా విధులపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు మరియు ఇతర కీలక ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.ముఖ్యమంత్రి పర్యటన భద్రతా ఏర్పాట్లలో భాగంగా సుమారు 500 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని విధుల్లో నియమించినట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని, విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి , కర్నూలు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఉపేంద్ర బాబు , సీఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తుపైనే దేశ భవిష్యత్.. వ్యసనాలకు దూరంగా ఉండండి: రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం.

## బ్రాహ్మణ కోట్కూరు లో జిల్లా పరిషత్ హై స్కూల్ నందు మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సు.

**నందికొట్కూరు జూన్ 24( నంది పత్రిక )** యువతి యువకులు వ్యసనాలకు దూరంగా ఉండి సత్ప్రవర్తన కలిగిన ఉత్తమ పౌరులుగా రాణించబడినప్పుడే దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించగలుగుతారని, సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో నిలబడతారని మీ బంగారు భవిష్యత్.. దేశ భవిష్యత్తు నిర్ణయిస్తుందన్న విషయాన్ని గమనించి వ్యసనాలకు దూరంగా ఉండాలని రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం యువతకు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా ఎస్పీ సుశీల్ షోరాన్ ఆదేశాల మేరకు భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ ( వ్యసన రహిత భారతదేశం ) కార్యక్రమాన్ని మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్టుకూరు గ్రామం నందు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం , ఎస్సై మణికంఠ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హై స్కూల్ నందు మడకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నేటి యువత మాదకద్రవ్యాల భారిన పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు తమపై ఎంతో నమ్మకంతో వారు శ్రమించి కష్టార్జితంతో తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎంతో శ్రమించి మంచి భవిష్యత్తు కోసం విద్యను అందిస్తే విద్యార్థులు యువత చెడు వ్యసనాలకు దగ్గర కావడం చాలా బాధాకరమన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తుపై తల్లిదండ్రుల ఆలోచన విధానాన్ని కలలను కన్నీటి పర్యంతం చేయవద్దని, విద్యార్థి దశలోనే జ్ఞానవంతులై మంచి ప్రవర్తనతో ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో రాణించినప్పుడే సమాజంలో గౌరవం దక్కుతుందని విషయాన్ని గమనించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయరాదని, చెడు వ్యసనాలకు దగ్గర చేసే స్నేహాన్ని వదులుకోవాలని , మంచి భవిష్యత్తుకు బాటలు వేసే స్నేహాన్ని పెంచుకోవాలి విద్యార్థులకు సూచించారు. మాదకద్రవ్యాల వాడకంపై జరిగే అనర్థాలపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. సమాజంలో మాదక ద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని, డ్రగ్స్ నిర్మూలనకు పోలీసులకు సహకరించాలని , ఏదైనా సమాచారం తెలిస్తే పోలీస్ శాఖకు అందజేయాలని కోరారు. మాదకద్రవ్యాలు విక్రయించిన వినియోగించిన అలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు ఎవరు పాల్పడిన వారికి చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ సిబ్బంది, బ్రాహ్మణ కొట్కూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# గిరిజన పంటలకు శాస్త్రీయ మద్దతు ధర కల్పించాలి

### -దళారీల దోపిడీ గిరిజనులను కాపాడాలి

### ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య బహిరంగ లేఖ

**కర్నూలు సిటీ నందిపత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలలో, ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో నివసిస్తున్న లక్షలాది మంది గిరిజన రైతులకు కాఫీ, మిరియాలు, చెర్రీ, పసుపు, జీడిపిక్కలు తదితర వాణిజ్య పంటలే ప్రధాన జీవనాధారంగా ఉన్నాయని, అయితే ఆరుగాలం కష్టపడి గిరిజన రైతాంగం ఉత్పత్తి చేస్తున్న ఈ పంటలు నేడు వారి ఆర్థిక సంక్షేమానికి కాకుండా దళారుల జేబులు నింపడానికి ఉపయోగపడుతుండటం అత్యంత విచారకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, వ్యవసాయ శాఖామంత్రి కె. అచ్చెన్నాయుడుకు ఆయన రాసిన సుదీర్ఘ లేఖలో గిరిజన ప్రాంతాల్లోని వాణిజ్య పంటలకు శాస్త్రీయమైన మద్దతు ధర ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని, దళారీల దోపిడీని తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దళారులు, వ్యాపారస్తులు ఒక సిండికేట్‌గా ఏర్పడి వారి కష్టార్జితాన్ని నిలువునా దోచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేయాల్సిన ఐటీడీఏ సంస్థ కేవలం నామమాత్రపు కొనుగోళ్లు జరిపి చేతులు దులుపుకుంటోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. కొన్ని ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లు (ఎఫ్పీవో) సైతం సక్రమంగా పనిచేయడం లేదని, మార్కెట్ ధరలపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారే తప్ప జోక్యం చేసుకోవడం లేదని, దీనివల్ల గిరిజన రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని లేఖలో వివరించారు. రోజురోజుకూ సాగు ఖర్చులు, పెట్టుబడులు భారీగా పెరుగుతుండగా, మార్కెట్లో దళారులు ఇష్టానుసారంగా ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని, గత సంవత్సరం దళారులు కొనుగోలు చేసిన నామమాత్రపు ధరల వలన గిరిజన రైతాంగానికి కనీస పెట్టుబడి కూడా రాని దారుణ పరిస్థితులు నెలకొన్నాయని గుర్తుచేశారు. గత సంవత్సరం మార్కెట్ కొనుగోలు ధరలను పరిశీలిస్తే పసుపు కేజీ రూ.80/–, పార్మెంట్ కాఫీ గింజలు కేజీ రూ.300/–, చెర్రీగుల్ల కేజీ రూ.250/–, మిరియాలు కేజీ రూ.500/–, జీడిపిక్కలు 80 కేజీల బస్తా రూ.12,500/– మించలేదని, ఈ సంవత్సరం కూడా ఇంచుమించు అవే అత్యల్ప ధరలు కొనసాగుతుండటంతో గిరిజన కుటుంబాలు ఆర్థికంగా అల్లాడిపోతున్నాయని, ఈ దోపిడీ వ్యవస్థకు చరమగీతం పాడకపోతే గిరిజన సమాజం ఆర్థికంగా పూర్తిగా చితికిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి గిరిజన రైతులు పండించే వాణిజ్య పంటలకు మార్కెట్ ఒడిదుడుకులకు తట్టుకునేలా శాస్త్రీయంగా మద్దతు ధరలను ప్రకటించి, వాటికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా పసుపు కేజీకి కనీసం రూ.400/–, పార్మెంట్ కాఫీ గింజలు కేజీకి కనీసం రూ.650/–, చెర్రీ గుల్ల కేజీకి కనీసం రూ.450/–, మిరియాలు కేజీకి కనీసం రూ.1,000/–, జీడిపిక్కలు 80 కేజీల బస్తాకు కనీసం రూ.20,000/– చొప్పున ప్రభుత్వం నూతన మద్దతు ధరలను తక్షణమే ప్రకటించాలని కోరారు.



ప్రభుత్వం ప్రకటించిన ఈ మద్దతు ధరల ప్రకారమే ఐటీడీఏ ద్వారా క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, గిరిజనులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ నిర్దేశిత ధరల కంటే తక్కువకు కొనుగోలు చేసే దళారులు, వ్యాపారస్తుల సిండికేట్లపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లోని ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను (ఎఫ్పీవో)పునర్వ్యవస్థీకరించి, అవి గిరిజన రైతులకు నిజమైన మేలు చేసేలా నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉంచాలని, సమాజంలో అత్యంత వెనుకబడిన గిరిజనుల జీవనాధారాన్ని దళారీల బారి నుండి రక్షించి, వారికి పూర్తి ఆర్థిక భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం తగు చర్యలు చేపట్టవలసిందిగా సిపిఐ తరపున గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు.

# గుడిసె పైనుండి కింద పడిన వ్యక్తికి తీవ్ర గాయాలు



**రుద్రవరం ప్రతినిధి జూన్ 24 (నంది పత్రిక):** మండల కేంద్రమైన రుద్రవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గుడిసె పై నుండి కింద పడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు కోటకొండ చాకలి నరసింహుడు అనే వ్యక్తి గ్రామంలోని అటవీశాఖ కార్యాలయం వెనక భాగంలో నివాసం ఉంటున్నాడని తెలిపారు. నరసింహుడు బుధవారం ఉదయాన్నే పశువుల గుడిసె పైకి ఎక్కి పట్ట కప్పుతుండగా ప్రమాదవశాత్తు జారీ కింద ఉన్న బండల పై పడడంతో తలకు ముఖానికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. తీవ్ర గాయాలకు గురైన నరసింహుడిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హుటా హుటీన స్థానిక ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం అందించేందుకు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వెంటనే అక్కడి నుండి కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

## పశ్చిమగోదావరి జిల్లా డిపిఓగా కె.అనురాధ పదవి బాధ్యతలు స్వీకరణ



**భీమవరం బ్యూరో చీఫ్ జోన్ 24 నంది పత్రిక** పశ్చిమగోదావరి జిల్లా డిపిఓగా పదవి బాధ్యతలు చేపట్టిన కె.అనురాధ బుధవారం కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాను అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందిస్తూ ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాల మేరకు సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. వీరు ఇంతకు ముందు ఏలూరు జిల్లా డిపిఓగా పనిచేస్తున్నారు, వీరిని ప్రభుత్వం పశ్చిమగోదావరి డిపిఓగా బదిలీపై నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. వీరు బుధవారం పశ్చిమగోదావరి డిపిఓగా పదవి బాధ్యతలు చేపట్టారు.

# సురక్షితమైన, పొదుపైన పైప్‌లైన్ గ్యాస్ కనెక్షన్లను పట్టణంలోని ప్రతి ఇంటికీ చేరవేయడమే లక్ష్యం





### పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 24 నంది పత్రిక** పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) గృహ కనెక్షన్ల పంపిణీ, వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, సురక్షితమైన, పొదుపైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ప్రతి ఇంటికీ పైప్‌లైన్ గ్యాస్ కనెక్షన్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) గృహ కనెక్షన్ల పంపిణీ, వినియోగంపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, జీజీపీఎల్ సేల్స్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తాడేపల్లిగూడెం పట్టణ ప్రజలందరూ పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగం వైపు అడుగులు వేయాలని సూచించారు. గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇప్పటికే 80 పైప్‌లైన్ కనెక్షన్లను పునరుద్ధరించినట్లు తెలిపారు. పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ సంస్థల అనుమతులతో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గ్యాస్ సరఫరా జరుగుతోందన్నారు. పట్టణ పరిధిలో నూరుశాతం కుటుంబాలు పైప్‌లైన్ నేచురల్ గ్యాస్ వినియోగించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎల్పీజీ సిలిండర్లతో పోలిస్తే పీఎన్‌జీ వినియోగం మరింత సురక్షితమైనదని, పైప్‌లైన్ ద్వారా నేరుగా ఇంటి వంటగదికి గ్యాస్ సరఫరా అవుతుందని తెలిపారు. దీంతో సిలిండర్ బుకింగ్, సరఫరా, మార్పిడి వంటి ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని చెప్పారు. కొత్తగా పీఎన్‌జీ కనెక్షన్ పొందదలచిన వినియోగదారులు రూ.6,650 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, అందులో రూ.5,570 కనెక్షన్ రద్దు చేసుకున్న సమయంలో తిరిగి చెల్లించబడుతుందని వివరించారు. వినియోగదారులు ఎంత మేర గ్యాస్ వినియోగిస్తే అంత మేరకు మాత్రమే మీటర్ రీడింగ్ ఆధారంగా చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఎల్పీజీతో పోలిస్తే తక్కువ వ్యయంతో గ్యాస్ అందుబాటులో ఉండటంతో పాటు నిరంతరాయంగా 24 గంటలపాటు సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. పీఎన్‌జీ వినియోగం వల్ల అగ్నిప్రమాదాల అవకాశాలు తగ్గడంతో పాటు భద్రతా ప్రమాణాలు మెరుగ్గా ఉంటాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి పీఎన్‌జీ ప్రయోజనాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రచార కార్యక్రమాలను మరింత ముమ్మరం చేసి రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సురక్షితమైన, పొదుపైన, పర్యావరణహితమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడంలో పీఎన్‌జీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న జాయింట్ కలెక్టర్, పట్టణంలోని ప్రతి ఇంటికీ పైప్‌లైన్ గ్యాస్ కనెక్షన్ అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో పీఎన్‌జీ మీటర్ల వినియోగ విధానం, పైప్‌లైన్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. తాడేపల్లిగూడెం ఎఫ్‌సీఐ కాలనీలో మొదటిసారిగా పైప్‌లైన్ నేచురల్ గ్యాస్ కనెక్షన్ నమోదు పత్రాలను వినియోగదారునికి అందజేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అలాగే కాలనీలోని వినియోగదారులతో ముఖాముఖిగా మాట్లాడి పీఎన్‌జీ సేవలపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్వయంగా ప్రచారం నిర్వహించి పైప్‌లైన్ గ్యాస్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి సూర్యరావు, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ హెప్సిబా, డీఎస్ఓ ఎన్.సరోజ, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు..

## వసతి గృహాలలో మెరుగైన వసతులు కల్పించాం అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 24 నంది పత్రిక** విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన విద్యాభ్యాసం కోసం ప్రభుత్వం వసతి గృహాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించిందని, అర్హులైన విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. బుధవారం భీమవరం కుముదవల్లి రోడ్డులోని నరసయ్య అగ్రహారంలో ఉన్న బీసీ వెల్ఫేర్ పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాల పరిశుభ్రత, వంటశాల నిర్వహణ, స్టోర్ రూమ్, ఆహార పదార్థాల నాణ్యత, బాత్ రూమ్స్, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు పోషకాహారం అందించడంలో కిచెన్ గార్డెన్లు ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.అనంతరం విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా, పాఠశాలలో బోధన ఎలా జరుగుతోంది, ఆరోగ్య పరిరక్షణపై తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారా, మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా, చదువుపై శ్రద్ధ కనబరుస్తున్నారా వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభిప్రాయాలను స్వయంగా తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వం లక్షలాది రూపాయల వ్యయంతో వసతి గృహాలను ఆధునిక వసతులతో అభివృద్ధి చేసిందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్య ద్వారా మాత్రమే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, విద్యార్థి దశను అత్యంత విలువైన కాలంగా భావించి క్రమశిక్షణతో చదువుకోవాలని హితవు పలికారు. అనవసర వ్యాపకాలకు దూరంగా ఉంటూ విద్యపై పూర్తి దృష్టి కేంద్రీకరించాలని, ఈ దశలో కష్టపడి చదివితే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని తెలిపారు.




సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎ.వి.సూరిబాబు, హాస్టల్ వెల్ఫేర్ అధికారి, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్‌లో భారీ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్.. ఆరుగురి అరెస్ట్

ఆన్‌లైన్ ట్రేడింగ్, పెట్టుబడుల పేరుతో భారీ మోసాలకు పాల్పడుతున్న ఆరుగురు సభ్యుల ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి ద్వారా ఓ వ్యక్తి రూ.1.22 కోట్లు నష్టపోయారని పోలీసులు బుధవారం వెల్లడించారు. నిందితుల్లో ఐదుగురు మహారాష్ట్రకు చెందినవారు కాగా, ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ఉన్నారు. ఈ అరెస్టులతో సైబర్ మోసాలకు సహకరించే ఆర్థిక నెట్‌వర్క్‌ను ఛేదించడంలో కీలక ముందడుగు పడిందని పోలీసులు తెలిపారు.వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌కు చెందిన బాధితుడిని ఈ ఏడాది జనవరిలో '282 బార్‌క్లేస్ ఇండియా హై–క్వాలిటీ స్టాక్ ట్రేడింగ్ రీసెర్చ్ గ్రూప్' అనే వాట్సాప్ గ్రూప్‌లో చేర్చారు. అధిక రాబడులు, ఐపీఓ కేటాయింపుల పేరుతో ఆశ చూపి ద్ఘుతీఎశ్రీఖఎంఋఅశ్రీమతీఝఎఅఅస్త్ర.ఎశీఎ, ఖజూజూ.ఎబశ్రీఅంష్ట్రమఝతీని.ఎశీఎ వంటి నకిలీ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా పెట్టుబడులు పెట్టించారు. నమ్మకం కలిగించేందుకు తొలుత రూ.1,05,000 విత్‌డ్రా చేసుకునేందుకు అనుమతించారు. అది నమ్మిన బాధితుడు 19 లావాదేవీల్లో మొత్తం రూ.1,22,18,029 పెట్టుబడిగా పెట్టారు.అనంతరం, బాధితుడి ఖాతాలో రూ.15.69 కోట్ల లాభం వచ్చినట్లు నకిలీగా చూపించి, ఐపీఓల విడుదల కోసం మరో రూ.35 లక్షలు డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించారు. సైబర్ క్రైమ్స్ డీసీపీ వి. అరవింద్ బాబు తెలిపిన వివరాల ప్రకారం, నిందితులు మ్యూల్ బ్యాంక్ ఖాతాల నెట్‌వర్క్‌ను ఉపయోగించి ఈ మోసాలకు పాల్పడ్డారు. కంపెనీలను స్థాపించి, అధిక విలువ గల కరెంట్ ఖాతాలు తెరిచి, వాటి ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలను మూడో పక్షానికి అందించి కమీషన్ పొందేవారు. విచారణలో ఒక యెస్ బ్యాంక్ ఖాతాకు దేశవ్యాప్తంగా 26 కేసులు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాకు 18 కేసులతో సంబంధం ఉన్నట్లు తేలింది. ఈ ఖాతాల ద్వారా రూ.కోట్లలో లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు.



# మొహరం పండుగను హిందూ ముస్లింలు కలిసికట్టుగా జరుపుకుంటారు - బ్ర్రై జహంగీర్

**ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపిన జహంగీర్**

**మత సామరస్యానికి ప్రతీకగా భువనగిరి దట్టి కట్టుకోవడం ఎంతో భాగ్యం**

భువనగిరి పట్టణ ప్రజలు మొహరం పండుగ సందర్భంగా మతసామరస్యాన్నిపెంపొందించుకొని సోదర భావంతో శాంతియుతంగా కలిసిమెలిసి ఉండాలని భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ తెలిపారు. బుధవారం భారా ఇమామ్ అసుర్ ఖాన్ లో జహంగీర్ దట్టి కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొహరం పండుగ మతసామరస్యం పెంపొందిస్తూ, శాంతి సామరస్యం ప్రజలలో విశ్వాసం, నమ్మకం అని భువనగిరి ప్రాంతం తో పాటు, దేశంలోని హిందూ, ముస్లిం మతాలను సమానంగా భావిస్తూ ప్రజలంతా ఈ మొహరం పండుగను కలిసికట్టుగా జరుపుకుంటారని, దీనివలన ముస్లిం, హిందూ ప్రజలంతా కూడా కలిసిమెలిసి స్నేహభావంతో ఉంటారని జహంగీర్ తెలిపారు. బారా ఇమామ్ అసూర్ ఖాన్ లో దట్టి కట్టే భాగ్యం లభించడం నాకు సంతోషమని, ముస్లిం మైనార్టీ సోదరులందరికీ కూడా మొహరం పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ సంతోషం వ్యక్తపరిచారు. ఈ మొహరం పండుగ అనేది ఒక సాంస్కృతి సాంప్రదాయమని ప్రతి సంవత్సరం కూడా భువనగిరి ఎపట్టణంలో పీర్లను వీధిలో గుండా ప్రధానం మార్గాల ద్వారా ఊరేగించడం, అందులో ప్రజలంతా మమేకమై ఆ ఆనందంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ స్నేహభావాన్ని వ్యక్తపరచడం భువనగిరి ప్రజలు చేసుకున్న ఒక శుభ పరిణామమన్నారు. ఇది ఇలాగే గత ఎన్నో సంవత్సరాల నుంచి కొనసాగుతున్న సాంప్రదాయమని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఈరపాక నరసింహ, హీరేకార్ శ్రీనివాస్, పిట్టల బాలరాజ్, కాల్యా నాగరాజ్, బోయిని బాలయ్య, ఎండి మసూద్, భూషపాక ఈశ్వర్ బాబు, బర్రె క్రాంతి పాల్గొన్నారు.



# ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అధ్యక్షునిగా పూస శ్రీశైలం




యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ప్రాంతీయ సర్వసభ్య సమావేశంలో భువనగిరి ఎంఆర్టి డివిజన్ అధ్యక్షులుగా పూస శ్రీశైలం ఎన్నికయ్యారు. ప్రాంతీయ అధ్యక్షులు పి.యాదగిరి అధ్యక్షన యాదాద్రి ప్రాంతీయ కార్యదర్శి ఎస్. అమర్నాథ్, బుధవారం నిర్వహించిన సమావేశం లో ఎం ఆర్ టి డివిజన్ ఎలక్షన్స్ లో ఏకగ్రీవంగా అధ్యక్ష కార్యదర్శులు ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పూస శ్రీశైలం, జేఎల్ఎం యాదాద్రి వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మల ఉపేందర్ రెడ్డి, సెక్రటరీగా గుమ్మల్ల సుధాకర్, అదనపు కార్యదర్శి ఎం. రామకృష్ణ, ట్రెజరర్ గా కే నాగప్రసాద్, ఎల్.శ్రీనివాస్ రెడ్డి ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి, సాయిబాబు నూతనంగా ఎన్నుకోబడిన ఎమ్మార్టీ డివిజన్ అధ్యక్షులు పూస శ్రీశైలంకి పూల బొకే ఇచ్చి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. తదనంతరం ప్రాంతీయ అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ, ఉద్యోగ కార్మికుల అందరికీ ప్రభుత్వం ఉద్యోగస్తులకు ఇస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలాగా కృషి చేస్తానని, పిఆర్సి కోసం కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వచ్చే విధంగా యూనియన్ నాయకత్వం పనిచేస్తుందని అన్నారు. ఉద్యోగుల సంక్షేమ సంస్థ బలోపేతం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన ఎమ్మార్టీ భువనగిరి డివిజన్ అధ్యక్షులు పూస శ్రీశైలం మాట్లాడుతూ, నా ఎన్నికకు సహకరించిన నాతోటి ఉద్యోగస్తులకు అందరికీ పేరుపేరునా అభినందనలతో రాష్ట్ర కమిటీ సభ్యులకు, సలహాదారుల కమిటీ సభ్యులకు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నా నన్నారు. ఉద్యోగ కార్మికుల సమస్యల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఉద్యోగ కార్మికుల యొక్క సమస్యల పరిష్కార దిశగా పనిచేస్తానని, ప్రతి ఒక్క ఉద్యోగ కార్మికునికి అందుబాటులో ఉంటానని తెలియజేశారు. ఈకార్యక్రమంలోసలహాదారుడు లక్ష్మణరావు, భువనగిరి డివిజన్ కార్యవర్గం, చౌటుప్పల్ డివిజన్ కార్యవర్గం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబు, టీజీస్పడీసీల్ కంపెనీ అధ్యక్షులు ఏ.వేణు, కంపెనీ కార్యనిర్వాహాక అధ్యక్షులు ఎన్. వెంకన్న, కంపెనీ అదనపు కార్యదర్శి ఎం. భాస్కర్ రెడ్డి, నల్గొండ జిల్లా అధ్యక్ష-కార్యదర్శులు జైపాల్ రెడ్డి, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



# దళిత క్రైస్తవుల ఎస్సీ హోదా రద్దు తీర్పు రాజ్యాంగ విరుద్ధం- స్కైలాబ్ బాబు

**బిజెపి 12 ఏళ్ల పాలనలో దళితులపై దౌర్జన్యాలు**
**అత్యాచారాలు 300 రెట్లు పెరిగాయి**
**మతం మారితే కులం మారదు**
**భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 16, 25 లను సుప్రీంకోర్టు హత్య చేసింది**
**కారంచేడు చుండూరులో జరిగిన మారణకాండ కులం మీదే గాని మతం మీద కాదు**
**అగ్రకుల క్రైస్తవులకు కులముపోలేదు**
**ఓబీసీ రిజర్వేషన్ రద్దు కాలేదు**
**కేంద్ర ప్రభుత్వమే దళిత క్రైస్తవుల పక్షాన సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ కి వెళ్ళాలి**
**1950 రాష్ట్రపతి ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలి**
**కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం డిమాండ్**

2026 మార్చి 24న దళితులు క్రైస్తవాన్ని స్వీకరిస్తే రాజ్యాంగ పరమైన హక్కులు, ఎస్సీ హోదా రద్దవుతుందని సుప్రీంకోర్టు 33 పేజీల తీర్పు కోట్లాదిమంది దళితుల గుండెపై దాడి చేసిందిని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15,16 ,25లను హత్య చేసిందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు విమర్శించారు. బౌద్ధం, సిక్కు మతాలలోకి వెళితే రాజ్యాంగ హక్కులు యధావిధిగా ఉన్నప్పుడు కేవలం క్రైస్తవంలోకి వెళితే మాత్రమే రాజ్యాంగ హక్కులు, చట్టాలు రిజర్వేషన్లు ఎందుకు లేకుండా పోతాయని ఈ తీర్పుపై కేంద్రం సుప్రీం కోర్టు ఫుల్ బెంచ్ కు వెళ్లి రాజ్యాంగ హక్కులు దళిత క్రైస్తవులకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. బుధవారం భువనగిరి లోని తిరందాసు గోపి మీటింగ్ హాల్లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ జిల్లా సదస్సు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ లింగం అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్కైలాబ్ బాబు మాట్లాడుతూ, రాజ్యాంగ స్పూర్తికి లోబడి కాకుండా మత విశ్వాసాల ఆధారంగా ఈ తీర్పు వెలువడిందని అన్నారు. ఈ తీర్పు సామాజిక న్యాయం, రాజ్యాంగ లక్ష్యాల మీద కూడా దాడి చేసిందన్నారు. కులం పుట్టుకతో వస్తుందని తనకు నచ్చిన మతాన్ని స్వీకరించటం విశ్వాసాలు, నమ్మకాల ఆధారంగా వస్తుంధన్నారు. మతం ఆధ్యాత్మిక విశ్వాసమని, కులం సామాజిక వంశపారంపర్యంగా కొనసాగుతున్న ఒక అవిభాజ్యమైన ప్రక్రియ అని తెలిపారు. క్రైస్తవంలోకి వెళ్లినవారిలో దళితులు మాత్రమే కులవివక్ష, అంటరానితనానికి ఎందుకు గురవు తున్నారో చెప్పాలన్నారు. దళిత పాస్టర్లే ఎందుకు దౌర్జన్యాలకు దాడులకు, హత్యలకు గురవుతున్నారని ప్రశ్నించారు. క్రైస్తవం పుచ్చుకున్నంత మాత్రాన కులవివక్ష, అంటరానితనం పోవట్లేదనే రుజువులు అనేకం ఉన్నాయన్నారు. ఒకవేళ అదే అయితే 1985లో కారంచేడులో దళితులను హత్య చేసిన సంగతి ఏమిటి? వారందరూ దళితులు క్రైస్తవులు కూడా అయినప్పటికీ మతం పేరుతో దాడి జరగలేదని కేవలం కులం పేరుతోనే దాడి హత్యలు జరిగాయని గుర్తు చేశారు. 1991లో చుండూరులో హత్యకు గురైన వారందరూ దళితులేనని, వారు క్రిస్టియన్ విశ్వాసాలతో ఉన్నారని, అయినా దారుణ హత్యజరిగిందన్నారు. మత విశ్వాసాల ఆధారంగా కాకుండా తాను పుట్టిన కులం ఆధారంగా వివక్షను, దాడులను, అత్యాచారాలను, హత్యలను ఎదుర్కొంటున్న పరిస్థితి నేటికీ కొనసాగుతుందన్నారు. అగ్రకులాల్లో పుట్టి క్రైస్తవాన్ని పుచ్చుకున్న వారు తమ సామాజిక హోదాగా ఉన్నత కులం ఆధారంగానే గౌరవించబడుతున్నారని, మతం మారినప్పటికీ చర్చిలు కూడా కులాల వారిగా ఉంటున్నాయని చర్చిలలో కూడా స్వకుల వివాహాలు జరుగుతున్నాయని చెప్పారు. దళితులు 15శాతం రిజర్వేషన్ పొందుతున్న వారు దళితులు క్రైస్తవం పుచ్చుకుంటే 1శాతానికి వారి రిజర్వేషన్ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ మతంలో గుడిలోకి రానీయకపోయినా, బడిలో చదువుకోనీయక పోయినా విద్య పరంగా, వైద్య పరంగా క్రిస్టియన్ మిషనరీ స్కూల్స్, మిషనరీస్ హాస్పిటల్స్, చర్చిలు సంపూర్ణంగా దళితుల్ని చేరదీశాయని తెలిపారు. ఎల్లయ్య అనే పేరిట దళితుడు హిందూ సమాజంలో ఉంటే ఎల్లిగాడు అని అవమానిస్తున్న స్థానంలో చర్చికి వెళితే ఏలియా అని పిలువబడుతున్నాడని గుర్తు చేశారు. మతం మారినంత మాత్రాన తమ బ్రతుకులు మారడం లేదని, వారు ఎదుర్కొశీటున్న కులవివక్ష పోవడం లేదన్నారు. బీసీలు 27 శాతం రిజర్వేషన్, ఓసీలు 10 శాతం, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పొందుతున్నారని, క్రిస్టియన్ మతాన్ని స్వీకరిస్తే ఆ రిజర్వేషన్ నుండి వాళ్ళు దూరం కావట్లేదన్నారు. కానీ దళితులు మాత్రమే క్రైస్తవంలోకి వెళితే ఆ రిజర్వేషన్ వాళ్ళు కోల్పోవాల్సి రావడం ఏమిటని ప్రశ్నించారు. ఇక్కడ గుడిలోకి రానివ్వరు అక్కడ చర్చిలోకి పోనివ్వరు దళితుల బ్రతుకులకు భరోసా ఎలా ఆయన ప్రశ్నించారు. బ్రదర్ అనిల్ కుమార్, బ్రదర్ సతీష్ కుమార్ లు లక్షలాది మందితో సభలు నిర్వహిస్తున్నారు వారిపై ఏ రకమైన దాడులు, దౌర్జన్యాలు జరగలేదు. కేవలం గ్రామ సీమల్లో దళిత పాస్టర్లుగా ఉన్న వారి పైన మాత్రం దాడులు, దౌర్జన్యాలు, హత్యలు కొనసాగుతున్నాయని, అంటే కులం కారణం కాదా అని అన్నారు. కేంద్ర బిజెపి సర్కార్ 12 ఏళ్ల పరిపాలన కాలంలోనే దళితులపై దాడులు, దౌర్జన్యాలు 300 రెట్లు పెరిగాయన్నారు. కేంద్ర ప్రభుత్వ అండదండలతోనే ఈ దౌర్జన్యాలు కొనసాగుతు న్నాయన్నారు. బిజెపి మతోన్మాద విధానాలపై పోరాటం చేయకుండా దళితుల హక్కులు రక్షించుకోలేమని చెప్పారు. 2018 లో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చడానికి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును దేశంలో ప్రతీ పౌరుడు ఐక్యంగా ఉద్యమించిన ఫలితంగా ఆ తీర్పు వెనక్కి తీసుకోబడింద న్నారు. అదే స్ఫూర్తితో 2026 మార్చి 24న వచ్చిన తీర్పును వెనక్కి తీసుకునేవరకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు.

ఈ సదస్సులో మార్చి 24న వెలువడించిన సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్ర ప్రభుత్వమే రాజ్యాంగ స్ఫూర్తితో సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ కి వెళ్ళాలని, రాజ్యాంగ విరుద్ధంగా 1950 లో తెచ్చిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ను రద్దు చేయాలని, కేజీ బాలకృష్ణన్ కమిషన్ నివేదికను బహిర్గతపరచాలని, దళిత క్రైస్తవుల పైన జరుగుతున్న దాడులను, దౌర్జన్యాలను అరికట్టాలని, దళిత క్రైస్తవులు రాజ్యాంగాన్ని, బైబిల్ ను 2చేతుల్లో పట్టుకొని రాజకీయ చైతన్యం ద్వారా చర్చిలో ప్రార్థన, రోడ్ పై శాంతియుత ప్రదర్శన నిర్వహించాలని తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి అన్నంపట్ల కృష్ణ, దళిత సంఘాల ఐక్యవేదిక జిల్లా నాయకులు బట్టు రామచంద్రయ్య, పిఎంసి రాష్ట్ర కార్యదర్శి సురుపంగ శివలింగం, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బర్ర సుదర్శన్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా, ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు గ్యార అశోకు, అబ్దుల్లాపురం వెంకటేష్, వడ్డేపల్లి యాదగిరి, పాపగళ్ళ లింగస్వామి, పాస్టర్లు కే దినాకర్, కొండపురం పౌల్, క్రిస్టోఫర్, బి. ప్రేమ్ కుమార్, ప్రకాష్, జాన్, పీటర్ బాబు, యాదగిరి, సునీత తదితరులు పాల్గొన్నారు.




## పల్స్ పోలియో, జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాలను విజయవంతం చేయాలి: ఎంపీడీవో ఎం.డి. గౌస్

సీరోల్ మండలంలో తేదీ 28-06-2026 రోజున పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో అప్పుడే పుట్టిన పిల్లల నుండి 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులందరికీ తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.డి. గౌస్ కోరారు. అలాగే, తేదీ 13-07-2026 రోజున జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల వారందరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వాడాలని సూచించారు. ఈ రెండు ప్రత్యేక కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# భూమిని చదును చేసి ఇండ్ల స్థలాలు కేటాయించాలి

**బట్టుపల్లి అనురాధ**

**20 ఏళ్ల క్రితమే ఇళ్లపట్టాలిచ్చిన సర్కార్**

**ఇప్పటివరకు లబ్ధిదారులకు భూమి ఎక్కడుందో చూపించని ప్రభుత్వం**

**పట్టాలు ఉన్నాయని డబల్ రూమ్ ఇళ్లకు ఇందిరమ్మ ఇళ్లకు నోచుకోని వైనం**

**కిరాయి ఇళ్లలో ఇక్కట్లు పడుతున్న పేదవారైన లబ్ధిదారులు**



భువనగిరి పట్టణ శివారులోని 700 సర్వే నెంబర్ లోని ప్రభుత్వ భూమిని చదును చేసి ప్లాట్లు చేసి పేద ప్రజలకు ఇండ్లు,ఇండ్ల స్థలాలను ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఎమ్మార్వో ఆఫీస్ ముందు లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ, ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం గత 20 సంవత్సరాల క్రితం పేదవారికి ఇళ్ల పట్టాలు ఇచ్చింది గాని భూమిని మాత్రం చూపించలేదని తెలిపారు. అప్పటినుంచి లబ్ధిదారులంతా తమకు ఇచ్చిన పట్టాలలోని భూములు ఎక్కడున్నాయో చూపించాలని, అదేవిధంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని పోరాటాలు చేస్తూ ఉన్నారన్నారు. ఇటీవల సిపిఎం పట్టణ కమిటీ పోరాట ఫలితంగా 700 సర్వే నెంబర్లులో అధికారులు వచ్చి సర్వే నిర్వహించి 20 ఎకరాలు సీలింగ్ భూమిగా, 18 ఎకరాలు పట్టాగా మొత్తం 38 ఎకరాలు ఉన్నదని తెలియజేశారని అన్నారు. భూమిని చదును చేసి ప్లాట్లు చేసి పేద ప్రజలకు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందనిన్నారు. పట్టాలు ఉన్నాయనే వంకతో అటు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇటు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వటానికి అధికారులు నిరాకరించారని తెలిపారు. ఇండ్లు,ఇండ్ల స్థలాలు లేక అద్దె ఇళ్లలో ఉంటూ, కిరాయిలు కట్టలేక పేద ప్రజలు ఇక్కట్లు పడుతున్నారన్నారు. కిరాయి ఇంట్లో ఉంటూ ఇంట్లో ఎవరైనా మరణిస్తే ఇల్లు లేకపోతే ఆ బాధ వర్ణాతీతం అనిన్నారు. గత 20 సంవత్సరాలుగా లబ్ధిదారులతో పోరాటాల నిర్వహిస్తున్న పట్టా కాగితాలకే పరిమితమయ్యారు తప్ప ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించలేదని, పేదవారి జీవితాలతో ప్రభుత్వం చెలగాటం మారుతుందన్నారు. ప్రజా పాలన అంటున్న ఈ ప్రభుత్వం కనీసం ప్రజల బాధలను అర్థం చేసుకునే పరిస్థితి లేదన్నారు. 700 సర్వే నెంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమిని చదును చేసి ప్లాట్లు చేసి పట్టణంలోని పేద ప్రజలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరొక్కసారి ఆక్రమించుకొని గుడిసెలు వేసి గుడిసేవాసుల భూపోరాటాన్ని ఉధృతం చేస్తామని అనురాధ ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, నాయకులు కొత్త లక్ష్మయ్య, గుడిసేవాసుల కమిటీ సభ్యులు దొడ్డి శంకర్, పిట్టల చంద్రశేఖర్ సత్తిబాబు, కొత్త లలిత, హేమలత, ప్రవంతి, వసుంధర, కళావతి, అరుణ, బాలమణి, శారద తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ధ్యేయం ఎమ్మెల్యే మందుల సామెల్

**జి రేపాక రైతులకు చెక్కులు పంపిణీ**

**రైతులకు నష్టపరిహారం చెల్లించడం ప్రత్యేక చొరవ తీసుకున్న కలెక్టర్ ఆర్ డి ఓ**

రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడ్డగూడూర్ మండలం జి.రేపాక గ్రామ శివారు లో గల ఇండిస్ట్రియల్ పార్క్ నిర్మాణం కోసం 10మంది రైతులకు ఎకరానికి 12 లక్షలు చొప్పున ఎమ్మెల్యే మందుల సామేలు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి చేతుల మీదుగా రైతులకు చెక్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఏమ్మెల్యే మాట్లడుతూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూసేకరణ చేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాలను కాపాడటమే తమ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. డి. రేపాక గ్రామ రైతుల భూములకు సంబంధించిన పరిహారం విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు ఆయన తెలిపారు. గతంలో నిర్ణయించిన రేటు ప్రకారం ఎకరాకు కేవలం రూ. 6 లక్షలు మాత్రమే ఇచ్చే అవకాశం ఉండేదన్నారు. అయితే, దశాబ్దాలుగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న రైతుల పరిస్థితిని వివరించడానికి తాను స్వయంగా జిల్లా కలెక్టర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యానని పేర్కొన్నారు. రైతుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని, నిర్ణయించిన రూ. 6 లక్షలకు తోడుగా మరో రూ. 6 లక్షలు కలిపి అందించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇందుకు అంగీకరించిన కలెక్టర్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతులతో పబ్లిక్ హియరింగ్ నిర్వహించి, ఈ ప్రక్రియను వేగవంతం చేసినందుకు స్థానిక ఆర్డీఓకు, ఇందుకు పూర్తిగా సహకరించిన మోత్కుర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డికి, సర్పంచ్‌కు, గ్రామ రైతులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి,తహసీల్దార్ ఎ. శేషగిరి రావు,డిప్యూటీ తహసీల్దార్ నరసింహ రావు, నగేష్ కుమార్,రెవిన్యూ ఇన్స్పెక్టర్,మాదవి, జి.రేపాక రైతులు పాల్గొన్నారు.



నంది పత్రిక

గురువారం 25 - 06 -2026

# మాదకద్రవ్యాల వల్ల జీవితాలను కోల్పోతున్న జాతీయ సంపదైన యువత - వి.మాధవి లత





**మాదకద్రవ్యాల పై అవగాహన**

**మాదకద్రవ్యాలవాడకం ఒక ఫ్యాషన్ గా భావిస్తున్న యువత**

**మాదక ద్రవ్యం నేరంలో చిక్కుకుంటే బయటపడటం కష్టం**

**కళాశాలలో మాదక ద్రవ్యాలు ర్యాగింగ్ యాసిడ్ పోయటం లాంటివన్నీ దురాలవాట్లే**

**డ్రగ్స్ నివారణ గోడ పత్రిక ఆవిష్కరణ**

**యువత దురలవాట్లకు దూరంగా ఉండాలి**

అంతర్జాతీయ మాదకద్రవ్య నిషేధ దినోత్సవం సందర్భంగా భువనగిరిలోని అరోరా కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగంపై జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ విద్యార్థులకు అవగాహన కల్పించారు. యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వారి సూచనల మేరకు, అంతర్జాతీయ మాధక ద్రవ్య నిషేధ దినోత్సవం, అక్రమ రవాణ అవగాహన కార్యక్రమములో భాగంగా బుధవారం అరోరా యూనివర్సిటీలో కళాశాల వారు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖ, డ్రగ్ అవగాహన, సంరక్షక యూనిట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ సంస్థ కార్యదర్శి వి. మాధవి లత మాట్లాడుతూ, డ్రగ్ వాడకం, దానికి ఆకర్షితులు కావటం యువత ఒక ప్యాషన్ గా భావిస్తున్నారని, ఈ దురలవాటులోకి వస్తున్నారని, మరికొందరు మానసిక వత్తిడి తగ్గుతుందని అలవాటు చేసుకోవటం జరుగుతుందని, ఇది వ్యసనంగా మారి జాతీయ సంపద అయిన యువత తమ జీవితాన్ని కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కసారి ఈ మాధక ద్రవ్య నేరములో చిక్కుకుంటే చట్టం నుండి తప్పించుకోవటం జరగదని, యువత ముఖ్యంగా దీనికి దూరంగా ఉండాలని తెలిపారు. ర్యాగింగ్ కూడా ఒక అనాగరిక చర్య అని, ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడితే చట్టం విధించే శిక్షలే కాకుండా, కళాశాల నుండి డీబార్ కూడా చేయటం జరుగుతుందని, జాతీయ న్యాయ సేవ సంస్థ డ్రగ్ అవేర్నెస్, వెల్నెస్ నావిగెషన్ అనే న్యాయ సేవల పథకాన్ని రూపొందించిం దన్నారు. ఈ పథకం క్రింద ప్రత్యేక జిల్లా యూనిట్ ఉందని, ఇందులో జిల్లా వైద్యాధికారి, జిల్లా విద్యాధికారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు ఉంటారని వీరు తగిన న్యాయ సేవలు, సహాయం అందేలా తోడ్పడుతారని తెలిపారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఆసిడ్ దాడులు కూడా ఒక అనాగరిక చర్యే అని తెలిపి, న్యాయ సేవ సంస్థ బాదితులకు న్యాయ సహాయంతో పాటు నష్ట పరిహారం కూడా అందచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విష్ణుమూర్తి తమ శాఖ ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, తనిఖీలు కూడా నిర్వహిస్తున్నట్లు, ముద్దాయిలకు, అక్రమ రవాణా చేసేవారిపై కేసులు పెట్టి శిక్షలు పడేలా కృషి చేస్తుందని తెలిపారు. భువనగిరి డి. ఎస్. పి బి. రవీందర్ మాట్లాడుతూ, యువత నేర ప్రవృత్తి మానుకోవాలని, పొగ త్రాగడం, మద్యం సేవించటం వ్యాసనాలకు లోనైతే జీవితానికి అర్థం ఉండదని తెలిపారు. జిల్లా మానసిక ఆరోగ్య ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ ప్రీతి స్వరూప్ డ్రగ్ అలవాటు మార్చుకోవటానికి ఏవిదంగా మన జీవన నడవడిని మార్చుకోవాలో, డ్రగ్ అలవాటు వలన మనకలిగే దుష్పలితాలపై వివరించారు. ట్రైని ఎక్సైజ్ ఇ ఎస్ వికాస్, ఎక్సైజ్ సి. ఐ లు రాధ కిషన్, బాలోజీ నాయక్ లు ఎక్సైజ్ శాఖ విధులు, మాధకద్రవ్య నిషేధంపై వారి శాఖ చేసే కృషిని వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ తమ అరోరా విద్యా సంస్థలు కేవలం చదువు మీదే శిక్షణ కాక, క్రమశిక్షణ రేపటి జీవితానికి కావాల్సిన విద్యా నైపుణ్యత కూడా నేర్పిస్తున్నామని, ఇలాంటి చైతన్య కార్యక్రమాలు నిర్వహించటానికి మా విద్యా సంస్థలు ఎప్పుడు ముందు ఉంటుందని తెలిపారు.

న్యాయ సహాయ న్యాయవాదులు ఎస్. సాయి శ్రీనివాస్, బి. వెంకటేష్, ప్యానల్ లాయర్ జె.భాస్కర్ రెడ్డిలు న్యాయ సహాయం, చట్టం పరిధులు, శిక్షల అమలు అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ వలన కలిగే నష్టాలపై లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఎక్సైజ్ శాఖ వారు రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ, సివిల్ పోలీసు వారు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అపర్ణ మోటివేషన్ సాంగ్ పాడారు.

## ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



–తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధ్యయన కేంద్రం (స్టడీ సర్కిల్), బంజారాహిల్స్, హైదరాబాద్‌లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్సి) సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (సి ఎస్ ఏ టి) 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్, తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ కలెక్టరేట్ లో బుధవారం కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ, తెలంగాణలోని 33 జిల్లాలకు చెందిన నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించని అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. అభ్యర్థులు 19 జూన్ 2026 నుంచి 12 జూలై 2026 వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకోసం ష్ట్రజూ:ꟷ/ంర్‌బుంఎఎఆఅతీఎశ్రీవ.షశీ.ఱఅ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 19 జూలై 2026న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత వసతి, భోజన సదుపాయాలతో కూడిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ హనుమకొండ జిల్లా అధికారి బి. నిర్మల, తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ సంచాలకులు డా. కె. జగన్ మోహన్, పర్యాటక అభివృద్ధి శాఖ జిల్లా అధికారి ఎం. శివాజీ, కనకరాజు, కవిత తదితరులు పాల్గొన్నారు.

# నాగారం హైస్కూల్‌లో డ్రగ్స్ అవగాహన సదస్సు

### హాజరైన ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్, ఎస్సై గోవర్ధన్




యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల (డ్రగ్స్) బారిన పడకుండా, వారి భవిష్యత్తును నాశనం చేసుకోకుండా ఉండేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం (జూన్ 24) నాగారం రోడ్డులోని నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు “మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సు“ (డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాం) నిర్వహించారు. ‘ఈగిల్ ఫోర్స్ తెలంగాణ‘ (ఈగల్ ఫోర్స్ తెలంగాణ, అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి హసన్‌పర్తి సీఐ ఎ. మహేందర్ ఎస్సై గోవర్ధన్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ మాట్లాడుతూ“విద్యార్థి దశ అనేది జీవితానికి ఎంతో కీలకమైనది. ఈ వయసులో చెడు అలవాట్లకు, ముఖ్యంగా డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి. మాదకద్రవ్యాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా ఉజ్వలమైన భవిష్యత్తు అంధకారమవుతుంది. డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్క విద్యార్థి ఒక సైనికుడిలా పనిచేయాలి.““మాదకద్రవ్యాల సరఫరా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలి. ఇందుకోసం ప్రభుత్వం కేటాయించిన టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా వాట్సాప్ నెంబర్ 8712685015 కు సమాచారం అందించి బాధ్యతాయుతమైన పౌరులుగా నిలవాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయి.“ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులందరితో “సే నోటు డ్రగ్స్– సే ఎస్ టు లైఫ్“ అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజ్ పూర్ లో ఘనంగా పాఠశాల పునర్ ప్రారంభం





**రాష్ట్రంలోనే ఇదొక అద్భుతమైన పాఠశాల**

**విద్య పట్ల సర్పంచ్ కున్న జిజ్ఞాస**

**16 లక్షల గ్రామ సర్పంచ్ సొంత నిధులతో అన్ని వసతులు**

**రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా నిలిచిన పాఠశాల**

**జిల్లా మండల స్థాయి అధికారులతో సాంకేతిక విభాగాలు ప్రారంభం**

**గ్రామంలో పండగ వాతావరణం**

**సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ కు అభినందనలు తెలుపుతున్న గ్రామస్తులు**

యాదాద్రి భువనగిరి జిల్లా తాజ్పూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పునర్ ప్రారంభ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తాజ్ పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ విద్య పట్ల, తమ గ్రామంలోని విద్యార్థుల పట్ల ఉన్న జిజ్ఞాసతో 16లక్షల రూపాయల స్వంత నిధులతో పాఠశాలను పునరుద్ధరించి రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా నిలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రముఖ నాయకుల చేతుల మీదుగా పాఠశాలలో పలు సాంకేతిక విభాగల ప్రారంభోత్సవం జరిగింది.

గ్రామంలో పండుగ వాతావరణం, జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోషా శ్రీనివాస్ 16లక్షల రూపాయలు తన సొంత నిధులను వెచ్చించి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాల కు దీటుగా నెలకొల్పారు. పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, ఎల్ ఈ డి డిజిటల్ క్లాస్ స్క్రీన్ లు, వైఫై, సీసీ కెమెరాలు, అదునాతన టాయిలెట్లు, ఆర్వో ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ లు,మొక్కలు నాటించడం, అందమైన గ్రీనరీ ఏర్పాటు, క్రీడా సామాగ్రి, తరగతి గదులలో విద్యా విజ్ఞాన చిత్రపటాలు, సమావేశ వేదిక ఏర్పాటు,నూతన నాణ్యమైన ఫర్నిచర్, విశాలమైన వంటగది రూపకల్పన,ఆటో సౌకర్యం, అదనపు వాలంటీర్ ను నియమించడం,తదితర ఎన్నో అత్యున్నత ప్రమాణాలతో పునరుద్ధరించి విద్యార్థుల సంఖ్య ఎంతో గణనీయంగా పెంచడం జరిగింది. వాటికి సంబందించిన ప్రారంభోత్సవ వేడుక ను ఘనంగా



నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శోభారాణి, జిల్లా విద్యాధికారి భిక్షపతి, జిల్లా గ్రంధాలయం చైర్మన్ అవైస్ చిస్తీ, సామాజిక వేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, ఎంఈఓ రంగరాజన్, ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, ఏ ఏ పీ సి చైర్మన్, వైస్ చైర్మన్, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు,యువజన సంఘాల నాయకులు, మహిళ లు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా తదితరులు పాల్గొన్నారు.







## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రామగిరి మండలం బుధవారంపేట పంచాయతీ పరిధిలోని శంకేశిపల్లె వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ కన్నూరి రవీందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బుద్ధార్థి బుచ్చన్న పటేల్ ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణం వలన గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం సులభం అవ్వటంతో పాటు ముఖ్యంగా వర్ష కాలంలో రవాణా సౌకర్యం మెరుగుపడి ప్రజలకు ఎంతో ఉపయోగకారంగా ఉంటుందన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో గ్రామ అభివృద్ధికి అవసరం అయిన మరిన్ని పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుద్ధార్థి విజయ, ఏఎంసి డైరెక్టర్ ఆరేల్లి శ్రీనివాస్, వార్డ్ సభ్యులు కన్నూరి రాకేష్, కన్నూరి శ్రావణ్, బావు స్వరూప కత్తెరసాల, మరుకు చంద్రశేఖర్, శీలం హర్షిత రాము, పంచాయతీ కార్యదర్శి చొప్పరి రాకేష్, కారోబర్ సతీష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## తమిళనాడు సీఎం విజయ్‌తో దిల్ రాజు భేటీ

ముఖ తెలుగు సినీ నిర్మాత దిల్ రాజు, తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు విజయ్‌ను చెన్నైలో మర్యాదపూర్వకంగా కలిశారు. విజయ్ పుట్టినరోజును పురస్కరించుకుని దిల్ రాజు ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కు పుష్పగుచ్ఛం అందించి తన అభిమానాన్ని చాటుకున్నారు. వీరిద్దరి మధ్య భేటీ ఎంతో ఆత్మీయంగా, ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com